మహామాయ-II

# ఆర్తనాదం

## డిటెక్టివ్ & మిస్టరీ నవల



రచన

**కనకమేడల**

మహామాయ-11

# ఆర్తనాదం

రచన

కనకమేడల

VIGHANA SAHITI
MADRAS-17

ప్రథమ ముద్రణ
జనవరి 1957

పాఠకులకు, ఏజెంట్లకు,

సంక్రాంతి పర్వదిన సందర్భంలో మీ అందరికీ మా శుభాకాంక్షలను ఆనందంతో అర్పిస్తున్నాం. మా పుస్తకాల పట్ల మీ ఆదరాభిమానాలు మరింత పెంపొందగలవని ఆశిస్తున్నాం.
పాఠకులు, ఏజెంట్లు, ప్రచురణ కర్తల మధ్య ఉన్న సంబంధం సుదృఢం కావాలనీ, ఒకరినొకరు సహనంతో ఔదార్యంతో అర్థం చేసుకుని ప్రవర్తించాలనీ కోరుతున్నాం.

మీ ఆదరాభిమానాలవల్ల సుస్థిరమైన ఉత్తమ ప్రచురణసంస్థగా పేరు సంపాదించుకొన్న మా సంస్థ తరఫున అందరికీ ఈ సందర్భంలో అభివందనాల నర్పిస్తున్నాం.

డైరెక్టర్

ముద్రణ: శ్రీనిలయం
మద్రాసు-17

అధికారాన్ని కోల్పోయి, ఎన్నో ఇక్కట్లను, అవమానాలను అనుభవించిన మహామాయ, మంత్రి సాధు చివరికి రాయదుర్గాధిపతి పుత్రుడు కిశోర్‌ను సహాయం కోరడానికి వెళ్లారు. కాని వాళ్ల ఆశ ఫలించలేదు. కిశోర్ వాళ్లకు సాయం చెయ్యడానికి నిరాకరించాడు. తుదకిద్దరూ తమకు సహాయం లభించగల స్థానం కోసం వెదకుతూ బయలుదేరారు. తర్వాత...

# 1

పక్షుల కిలకిలారావాల మేళవింపుతో ఉదయకాంత బంగారు మేలిముసుగుతో వేంచేసింది. నిర్మలంగా ఉన్న ఆకాశంలోంచి సూర్యభగవానుడు తొంగి చూస్తున్నాడు. ప్రకృతి చైతన్యాన్ని పొందింది. ఎక్కడచూసినా ఏదో కోలాహలం.

నర్మద భవనం చుట్టూ ఉన్న చెరువులోని నీరు ప్రశాంతంగా ఉంది. దాని గట్టుమీది చెట్లు పచ్చని ఆకులతో కనువిందుగా కనిపిస్తున్నాయి. సూర్యుని లేత వెలుగులో చెరువు మధ్య ఉన్న భవనం మెరుస్తోంది.

నర్మద ముఖ్య సహాయకురాలు మేడమీది గదిలో ఒంటరిగా కూర్చుని ఉంది. ఈ మధ్య ఆమెకు ఎటువంటి వార్తయూ అందడం లేదు. నర్మద భవనం వదలి వెళ్లి చాలా

వెళ్ళింది. ఇంకా తిరిగి రాలేదు. ఎలాంటి కబురూ పంపలేదు కూడా. ఆమె నర్మదను గురించే ఆలోచిస్తోంది.

ఇన్ని రోజులుగా ఆమె ఎన్నడూ ఎటువంటి కబురూ చెయ్యకుండా ఉండలేదు. ఆమె ఎక్కడ ఉందో? ఏవి పనులు చేస్తోందో? లేక ఎవరికైనా బందీగా చిక్కలేదు కదా!

గడపలోంచి ఏదో చప్పుడు వినిపించడంతో ఆమె ఆ ప్రక్కకు చూసింది. ఒక దాసి అక్కడ నిలబడి ఉంది.

"ఏంకావాలి?" ఆమె ప్రశ్నించింది.

"ఎవరో వచ్చి చెరువుగట్టున వేచి ఉన్నారు," దాసి సమాధానమిచ్చింది.

ఈమాట వినగానే ఆమె ఆసనంమీదినించి లేచి గబగబా క్రిందికి వచ్చేసింది. చెరువుకు అవతలి గట్టున ఉన్న ఆ వ్యక్తివంక ఓసారి చూసింది. అతను తమ గూఢచారులలో ఒకడు. అక్కడక్కడా తిరుగుతూ రహస్య విషయాలు సేకరించుకు వస్తూ ఉంటాడు. అతనిని చూడగానే ఆమెకు ప్రాణం లేచి వచ్చినట్టయింది. ఇతనికి తప్పకుండా నర్మద విషయాలు తెలిసి ఉంటాయి.

ఆమె పడవ నడుపుకుంటూ అవతలి ప్రక్కకు వెళ్ళింది. అతను మందహాసం చేస్తూ పడవలోకి ఎక్కాడు. కాసేపటికి పడవ మళ్ళీ ఇవతలివైపుకు వచ్చేసింది.

పడవను అక్కడ కట్టివేసి ఆమె భవనంలోకి దారి తీసింది అతనామె ననుసరించాడు. ఇద్దరూ ఒక గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. కాసేపటివరకు ఎవరూ మాట్లాడలేదు.

'ఎక్కడినించీ రాక ?' చివరికి ఆమె అతనినడిగింది.

'నర్మదగారిని కలుసుకున్నాను. ఆమె నన్నిక్కడికి పంపింది,' అతను సమాధానమిచ్చాడు.

'ఏమిటి సంగతులు ? విశేషాలేమైనా చెప్పిందా ?'

'అందరూ క్షేమమేనని ఆమె అంది. ప్రతాప్, జయంత్ వగైరాలు తమ కోటకు వెళ్ళిపోయారట. కిరణ్మయి, లావణ్య అక్కడే ఉన్నారట.'

'మరి నర్మదగారేం చేస్తున్నట్టు ?'

'ఆమె వేరే ఏదో పనిమీద బయలుదేరారు.'

'ఇక్కడికి రావడానికి అవకాశం లేదన్నారా ?'

'ఔను.'

'ఏమిటో అత్యవసర విషయం.'

'నాతో ఆ విషయాలేం చెప్పలేదు. నేనూ అడగలేదు కూడా. అయితే ఆమె నాకో ఉత్తరం ఇచ్చి మీకిమ్మని చెప్పారు,' అంటూ అతను ఒక ఉత్తరాన్ని ఎక్కడినించో బయటికితీసి ఆమె చేతిలో ఉంచాడు.

ఆమె ఆత్రంగా ఆ ఉత్తరాన్ని అందుకుంది. మడతలువిప్పి గబగబా చదవనారంభించింది.

ఆమె ముఖంలో ఆనందవిచారాలు క్షణక్షణానికీ మారుతూ కనిపించాయి. ఆ ఉత్తరం చదవడం ముగించిన తర్వాత ఆమె దానిని మడచి దాచింది. అతనివంక చూసి నెమ్మదిగా అంది.

" నువ్వు వెళ్ళి కొంచెం విశ్రాంతి తీసుకో. ఫలహారానికి ఏర్పాట్లు జరిగే ఉంటాయి. తర్వాత అవసరమైతే, మళ్ళీ ఓసారి కలుసుకుని మాట్లాడుకుందాం."

అతనా గదిలోంచి నెమ్మదిగా బయటికి నడిచాడు. ఆమె ఆలోచిస్తూ కూర్చుంది. కాని ఎంత సేపటికీ ఆ ఆలోచనలోంచి తెలుసుకోలేక పోయింది. ఇంతలో దాసీది వచ్చి పిల్చింది.

"ఫలహారం ఇక్కడికి తెమ్మంటారా?" దాసి అంది.

"వద్దు. ఇప్పుడు నేనేమీ తినను," ఆమె ఆలోచిస్తూనే సమాధానమిచ్చింది.

దాసీది కొంచెం ఆశ్చర్యంగా అక్కడినించి వెళ్లి పోయింది.

మరి కొంత సేపటికీ ఆమె ఒక్కసారిగా లేచి నిలబడింది. ఏదో ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా గదిలోంచి బయటికి నడిచింది. అప్పటికి కొంచెం ఆకలిగా కూడా ఉందేమో, దాసీ దాన్ని పిల్చి ఫలహారం తెప్పించుకుని ఆరగించింది.

ఆమె తిరిగి తన గదిలోకి వెళ్లిన కాసేపటికి ఆ గూఢ చారి మళ్లీ ఆ గదిలో ప్రవేశించాడు.

"ఎక్కడికైనా వెళ్లాలా?" ఆమె అడిగింది.

అతను తల ఊసాడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు. "ఇక్కడ కూర్చుని నేను చేసేది మాత్రమేముంది? నేను కూడా వెళ్లి ధర్మదగారికే విషయంలోనైనా సహాయ పడదామని అనుకుంటున్నాను."

"మరి వచ్చింది దేనికి?"

"ఆ ఉత్తరం ఇవ్వడానికే."

"కాని నాకు సహాయంగా మరో మనిషి కావాలిక్కడ. పోనీ నర్మదగారిని కలుసుకున్నప్పుడు ఈ విషయం ఆమెకు చెప్పు. ఆసలామెను ఒకసారి వచ్చి చూసిపోవలసిందిగా కోరానని చెబితే మరీ మంచిది."

అతను సరేనన్నట్టుగా మళ్లీ తల ఊపాడు. ఇద్దరూ ఆ గదిలోంచి బయలుదేరారు. పడవదగ్గరకు వెళ్లారు. పడవలో బయలుదేరారు. వంకరలు త్రిప్పుతూ ఆమె పడవ నడప సాగింది.

అకస్మాత్తుగా ఆమె ఓసారి ఒడ్డుకేసి చూసింది. భయం ఆశ్చర్యం ఆమెను వెంబడించాయి. ప్రక్కనే ఉన్న వ్యక్తి కేసి వింతగా చూసింది. ఆమె ముఖ కవళికలను పరీక్షిస్తున్న అతను వెంటనే అడిగాడు,

'ఏం జరిగింది? పరీక్షగా చూస్తున్నారు!'

ఒక్క నిమిషంవరకు ఆమె మాట్లాడలేకపోయింది. తర్వాత హీనస్వరంలో అంది.

'చెరువులో నీళ్లు తగ్గిపోతున్నట్లు నాకు అనుమానంగా ఉంది.'

అతనుకూడా కంగారుగా ఒడ్డుకేసి చూశాడు. మొత్తానికి చెరువులో నీరు కొంత తగ్గినట్టే అతనికీ అనిపించింది. అందుకు కారణం మాత్రం అతనికి గోచరించలేదు. ఈ చెరువులో నీరు తగ్గిపోవడమంటూ ఎన్నడూ జరగలేదు ఇంతకుముందు. అసలు చెరువులో నీరు తగ్గిపోదని నర్మద ఒకసారి చెప్పినట్టు కూడా అతనికి గుర్తు. అతను ఆలోచిస్తూ మౌనం వహించాడు. అతను మాట్లాడకపోవడం చూసి ఆమె మరింత కంగారుగా అడిగింది.

"అసలు ఈ చెరువులో నీరు తగ్గిపోతుందన్న సంగతి నాకూ తెలియదు. నే నీభవనంలోకి ప్రవేశించిన తర్వాత ఇదే మొదటిసారి నాకు అనుమానం కలగడం. నర్మదకూడా ఎప్పుడూ ఈ విషయాన్ని గురించి నాకు చెప్పలేదు." ఆమె అంది సందేహంగా.

'చెరువులో నీరు తగ్గిపోతున్న విషయం మాత్రం ఖాయం. ఇందాకటికంటే ఇప్పుడు మరింత తగ్గినట్టు నాకు అనుమానంగా ఉంది. పైన ఒడ్డు ఇంకా తడిగా ఉంది. దానిని బట్టే నీరు తగ్గిపోతున్నట్టు ఖాయంగా తెలుస్తోంది,' అతనన్నాడు.

'ఇలా నీరు తగ్గిపోవడానికి కారణమేమిటో మనం తెలుసుకోవాలి. లేకపోతే అపాయ పరిస్థితి ఏర్పడుతుంది,' ఆమె కంగారుపడుతూ అంది.

ఇద్దరూ పడవమీద అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. చెరువుకు నాలుగువైపులా తిరిగి నీరు ఎలా తగ్గిపోతోందో చూడాలని వాళ్లు నిర్ణయించుకున్నారు. కాని చెరువుచుట్టూ ఎన్ని ప్రదక్షిణాలు చేసినా నీరు ఎలా తగ్గిపోతున్నదీ, ఎక్కడినించి తగ్గిపోతున్నదీ మాత్రం వాళ్లకు తెలియలేదు.

ఇంతలో అకస్మాత్తుగా భవనంలోంచి కోలాహలం వినిపించింది. కేకలు, అరపులు వినడంతో ఆమె మరింత కంగారుపడింది. ఇద్దరి దృష్టి చెరువుమీదికి ప్రసరించింది. చెరువులో ఏర్పాటు చేయబడిన తీగెలతల, నీరు తగ్గిపోవడంతో అక్క-

డక్కడా బయటికి కనిపిస్తోంది. పడవనడిచే మార్గం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇందువల్లనే లోపలివాళ్లు కంగారు పడుతున్నారేమోనని ఆమె అనుకుంది. అతనివంక చూసి నెమ్మదిగా అంది.

“చెరువులో నీరు తగ్గిపోతున్న సంగతి లోపలి వాళ్లకు కూడా తెలిసింది. అందుకే వాళ్లు కోలాహలం చేస్తున్నట్టున్నారు. నువ్వు మరోసారి చుట్టూ తిరిగి చూసిరా. నేను భవనంలోకి వెళ్లి అందరికీ కొంచెం ధైర్యం చెప్పివస్తాను.”

అతనందుకు సరేనన్నట్టు తల ఊపాడు. ఆమె పడవలో వెనక్కి బయలుదేరి భవనంలోపలికి ప్రవేశించింది. అక్కడ ఒకచోట ఆమె చూసిన దృశ్యం ఆమెను ఆశ్చర్యచకితురాలిని చేసింది.

ముసుగులు వేసుకున్న ఇద్దరు వ్యక్తులు తమ భటులను ఎదిరించి పోరాడుతున్నారు. ఆ ఇద్దరు వ్యక్తులు స్త్రీలే అయినా వాళ్లను ఎదుర్కోగల శక్తి తమ భటులకు లేదని ఆమె గ్రహించింది. భటులు ఒక్కరొక్కరుగా నేలమీదకి ఒరిగిపోతున్నారు.

పట్టరానికోపంతో ఆమె కత్తి దూసింది. కాని మరు క్షణంలో వెనకనించి ఎవరో ఆమె తలమీద గట్టిగా కొట్టినట్టయింది. ఆ దెబ్బకు తట్టుకోలేక ఆమె వెంటనే స్పృహ తప్పి నేలమీదకు ఒరిగిపోయింది. తర్వాత ఏం జరిగిందీ ఆమెకు తెలియదు.

యుద్ధం చేస్తున్న భటులందరూ కూడా నేలకూలిపోయారు. అక్కడున్న ఇద్దరు ముసుగు వ్యక్తులు కాక మరో ముసుగు

మనిషికూడా చాటుగా నిలబడి ఉంది. ఆమే నర్మద సహాయకురాలి తలమీద చాటునించి దెబ్బ కొట్టింది.

భటులందరూ ఒరిగిపోయింతర్వాత ముసుగు వ్యక్తులు ముగ్గురూ అక్కడినించి గబగబా చెరువు దగ్గరకు వచ్చారు అక్కడ ఉన్న పడవ ఎక్కి బయటికి స్పష్టంగా కనిపిస్తున్న మార్గంలో పడవ నడుపుకుంటూ అవతలి గట్టుకు వెళ్ళారు. పడవను అక్కడవదలి ఒడ్డెక్కి ఒకసారి నాలుగు వైపులకూ చూసి తిన్నగా ముందుకు నడచిపోసాగారు.

చెరువుకు నాలుగువైపులా తిరుగుతున్న ఆ గూఢచారి దృష్టి అకస్మాత్తుగా ఆ ముసుగు వ్యక్తులమీద పడింది. అతను గబగబా పడవదగ్గరకు వచ్చాడు. కాని అతనికి నర్మద సహాయకురాలు కనిపించలేదు. భవనంలోంచి ఎటువంటి కోలాహలమూ వినిపించలేదు.

అతనికంతా విచిత్రంగా కనిపించింది. ఆ ముసుగు వ్యక్తులు శత్రువులో, మిత్రులో అన్న అనుమానం అతనికి కలిగింది. భవనంలోపలికి వెళ్లి పరిస్థితి చూడాలో లేక ఆ వెళ్తున్న వాళ్లను అనుసరించాలో నిర్ణయించుకోడానికి అతను కాసేపాలోచించాడు.

భవనంలో ఎలాగో ఆమె ఉందికదా ఫర్వాలేదనుకున్నాడతను. కాని అతని మనస్సు ఇంకా ఆలోచించడం మానలేదు.

ఆ ముసుగు వ్యక్తులు క్రమంగా చెట్లలో లీనమై పోతున్నారు. ఇక ఎక్కువసేపు ఆలోచిస్తూ కూర్చోవడం మంచిది కాదనుకున్న ఆ గూఢచారి, వాళ్లు వెళ్లినవైపుకు దారితీశాడు. వేగంగా నడక సాగించాడు.

నట్టడవిలో నిలబడిపోయి దిక్కులు చూస్తున్న మహామాయ చివరికి నెమ్మదిగా మంత్రితో అంది.

'ఈ కేక ఎక్కడినించి వినిపించినట్టు!'

'అదే నేనూ చూస్తున్నాను. దగ్గర్లో ఎవరూ ఉన్నట్టు కనిపించడం లేదు,' మంత్రి సమాధానమిచ్చాడు.

ఆమె కంగారు పడుతున్న తన మనస్సును అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నించసాగింది. పరిస్థితులు తన కనుకూలంగా ఉన్నట్టు ఆమెకు కనిపించడం లేదు. మంత్రి సాధు కూడా అంత ఆనందంగా లేడు. తమ కథాగతి ప్రాప్తించినందుకు వాళ్ళిద్దరూ ఎంతో కొంత కుమిలిపోతూనే ఉన్నారు. అయితే తమతమ బాధని పైకి చెప్పుకోడానికి ఎవరూ ఇచ్ఛగించడం లేదు. ఒకరికొకరు ధైర్యం చెప్పుకోడానికి వాళ్లు ప్రయత్నిస్తున్నారు.

'పిల్చిందెవరో మనకు తెలియదు. చూస్తే, ఎవరూ కనిపించడం లేదు. ఇక్కడ నిలబడినా ఎవరూ మన కెదురు రాలేదు. అందుచేత ఇంకా కంగారు పడవలసిన అవసరం ఏమాత్రం లేదు. ముందుకు వెళ్లిపోదాం,' అన్నాడు సాధు ధైర్యంగా.

మహామాయ మౌనం వహించింది. ఒక్కక్షణం ఏదో ఆలోచించి అతని వెనకే వెళ్లడానికి పూనుకుంది. ఇద్దరూ అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు సాగారు. ఒకరి మనస్సుల్లో ఉన్న విషయాలు మరొకరికి తెలియవు. చరిస్తున్నా

ఎవరికి వారు ఏవో విషయాలు ఆలోచించుకుంటూనే ఉన్నారు.

కొద్దిదూరం వాళ్లు నడిచారో లేదో ప్రక్కన దట్టంగా పెరిగి ఉన్న చెట్లలోంచి ఆకులు కదలిన చప్పుడు వినిపించింది.

ఇద్దరి దృష్టీ ఆ ప్రక్కకు ప్రసరించింది. కాని ఈసారి వాళ్లు అక్కడ నిలబడలేదు. ముందుకు నడుస్తూనే ఉన్నారు.

'అడవిలో ఆకులు గలగలమనడం మామూలు విషయమే. తాటాకు చప్పుళ్లకు మనం బెదిరిపోతే ఎలా?' అన్నాడు మంత్రి నవ్వుతూ.

'కాని నాకెందుకనో కొంచెం కంగారుగానే ఉంది.' వశం తప్పిపోతున్న మనస్సును అదుపులో పెట్టుకోవడం సాధ్యం కాక మహామాయ అనేసింది.

'ఇంతమాత్రానికేనా!' మంత్రి పరిహాసంగా అన్నాడు.

ఆమె మౌనం వహించి తల ఊపింది. తన పరిస్థితిని గురించి పునరాలోచించుకో సాగింది.

'ఇంత చిన్న విషయాలకే కంగారు పడిపోతున్న దానివి ఇదివరకంతటి సాహసకార్యాలనెలా చెయ్యగలిగావో నాకు వింతగానే ఉంది,' మంత్రి మళ్లీ అన్నాడు.

'అప్పటి పరిస్థితులు వేరు,' ఆమె క్లుప్తంలో అతని ఆశ్చర్యానికి సమాధానంగా అంది.

'అప్పుడు మహారాణివి, ఇప్పుడు కాదు. అంతేగా భేదం. ఇంత మాత్రానికే అంతగా భయపడి పోతున్నావా! ఎంత అనుకున్నా ఆడవాళ్లు అంతేనేమోలే,' మంత్రి మరింత పరిహాసంగా అన్నాడు.

ఈ సమయంలో అతనెంత పరిహాసంగా మాట్లాడినా ఆమె ఏమీ చెయ్యలేని స్థితిలో ఉంది. మళ్లీ మౌనం వహించింది. మంత్రితో పరిహసింపబడే ఈ అధమ పరిస్థితికి ఆమెకు ఏడ్పు వస్తున్నట్టుగా ఉంది. కాని ఏం చెయ్యగలదు! పరిస్థితులకు కట్టుబడక తప్పదు.

అలా ఇద్దరూ మాట్లాడుకుంటూ మరి కొంతదూరం నడిచారు. మళ్ళీ అదే ఆకులచప్పుడు వాళ్లకు వినిపించింది.

'ఎవరో మనల్ని వెంటాడుతున్నట్టు నాకు అనుమానంగా ఉంది. ఇది కేవలం ఆకులు కదలడంవల్ల ఏర్పడిన సవ్వడి మాత్రమే కాదు. కావాలని ఎవరో చేస్తున్న చప్పుడు,' అన్నది మహామాయ.

మంత్రి హేళనగా మందహాసం చేశాడు.

'కాని మన కంటికి ఎవరూ కనిపించడంలేదు. పోనీ ఎవరైనా మనల్ని వెంటాడుతున్నారనుకున్నా ఇంతదూరం కనిపించకుండా వెంటాడతారా? ఎక్కడో ఒకచోట ఎదుట పడి ఉండేవాళ్లు.'

'ఎదుటపడడం ఇష్టం లేదేమో?'

'అయితే వెంటపడడం దేనికి?'

'అవన్నీ నేను ఆలోచించలేదు,' మహామాయ కొంచెం బాధగా అంది.

మంత్రి సాధు ఆమెవంక చూసి మళ్లీ చిరునవ్వు నవ్వాడు.

'ఎందుకీ అనవసర విషయాలన్నీ! మన దారిని మనం పోతే పోతుందిగా. ఎవరైనా వెంటాడినా ఎదురు రానంతవరకు

మనకేం నష్టం లేదు. ఎదటికి వస్తే అప్పటి సంగతి అప్పుడు చూసుకుందాం,' అన్నాడతను.

ఇంతలో భయంకరమైన అట్టహాసం వాళ్లకు వినిపించింది. ఆ అట్టహాసం వినిపించగానే ఇద్దరూ ఎక్కడి వాళ్లక్కడ ఆగిపోయారు. అటూ ఇటూ తమ చూపులు పోనిచ్చారు. కాని ఎవరూ కనిపించ లేదు.

'ఎవరో మనల్ని వెంటాడుతున్న మాట నిజమే కాని ఎవరైందీ తెలియడం లేదు," మంత్రి చివరికి నెమ్మదిగా అన్నాడు.

'అదే నేను ఇందాకటినించీ అంటున్నాను,' ఆమె అంది.

'అట్టహాసం వినిపించినవైపు వెళ్ళి చెట్లచాటున ఎవరైనా ఉన్నారేమో చూసొస్తా,' అంటూ మంత్రి ఎడమవైపుకు ఒక్కడుగు వేశాడు.

'ఇటు ఎవరూ రానక్కరలేదు. నేనే వస్తున్నాను,' చెట్ల మధ్యనించి ఈ మాటలు వాళ్లకు వినిపించాయి.

మంత్రి అక్కడే ఆగిపోయాడు. జరగబోయే సంఘటనని గురించి ఆలోచిస్తూ మహామాయ కూడా నిలబడిపోయింది.

ఒకనిమిషం భారంగా గడచిపోయింది. యమదూత భయంకరాకారం చెట్లచాటుగా బయటికివస్తూ వాళ్లకు కనిపించింది. ఇద్దరూ అతనివంక చూస్తూ నిశ్చేష్టులై నిల్చిపోయారు.

యమదూత మందహాసం చేస్తూ వాళ్ల ఎదటికివచ్చి నిలబడ్డాడు. ఇద్దరివంకా ఓసారి పరీక్షగా చూశాడు.

'ఇంతసేపూ ఏవో అరుపులు ఊరికే చప్పుడు చేస్తున్నాయని మీ ఉద్దేశంలాగుంది,' మంత్రితో అన్నాడు యమదూత.

యమదూతను అకస్మాత్తుగా చూడగానే ఆ సమయంలో ఇద్దరికీ ఎంతో కొంత భయం కలిగిన మాట వాస్తవమే అయినా అతను ఒంటరిగా ఉన్నాడన్న విషయం తెల్చుకోగానే మంత్రికి ధైర్యం కలిగింది. యుద్ధ విద్యలో కాని ఇతర శక్తి సామర్థ్యాలలో కాని అతనూ తక్కువ వాడు కాదు.

లేకపోతే ఇంతసేపు పిరికి పందలా చెట్లచాటున దాగి రావాల్సిన అవసరం నీకెందుకు కలిగిందో!' మంత్రి ఎకసక్కెంగా అన్నాడు.

'కావాలనే అలా చేశాను. ఇందులో పిరికితనమేమీ లేదు. ఇంతదూరం మిమ్మల్ని రానివ్వడమే నా ఉద్దేశం,' యమదూత అన్నాడు.

'ఇంతదూరం మేం రావడంవల్ల నీకు కలిగిన ప్రత్యేక లాభమేమిటో నాకు గోచరం కాకుండా ఉంది,' మంత్రి అనుమానంగా అన్నాడు.

ఆ సంగతి మీకెంత ఆలోచించినా తెలియదులే,' యమదూత సమాధానంగా పలికాడు.

'సరే. ఈ విషయాలన్నీ ఎందుకు? నిన్ని సమయంలో ఇక్కడ చూసినంత మాత్రాన మేం భయపడాల్సిన అవసరం మాత్రం ఏముంది?' మంత్రి అన్నాడు.

యమదూత కళ్ళు కొంచెం పెద్దవి చేశాడు. నెమ్మదిగానే అన్నాడు.

'నేను ఒంటరిగాడినని, నన్నెలాగైనా మాయచేసి నా చేతిలోంచి తప్పించుకుపోవచ్చునని అనుకుంటున్నారేమో కాని ఆ పని మీవల్ల కాదు. దగ్గరలోనే నాకు సహాయం చెయ్యగలవారున్నారు.'

'ఎవరు నీకు సాయం చేసేది?' మంత్రి పరిహాసంగా అన్నట్టన్నాడు.

'రఘువీర్ మహారాజు,' యమదూత నోటినుండి వెంటనే ఈమాట వెలువడింది. తొందరపడి తానామాట అన్నందుకు అతను తర్వాత నాలుక కొరుక్కున్నా ప్రయోజనం లేక పోయింది.

రఘువీర్ మహారాజు పేరువినగానే మహాచాయ భయంతో వణికిపోయింది. మంత్రికూడా చాలా కంగారుపడినా మనస్సును కుదుటపరచుకోడానికి ప్రయత్నించసాగాడు.

'ఇప్పుడు మీరిద్దరూ మాట్లాడకుండా నాతోపాటు రావాలి,' యమదూత అన్నాడు.

'ఎక్కడికి?' మంత్రి అడిగాడు.

'అదంతా మీ కనవసరం. ఇప్పుడు నేను చెప్పినట్టు చెయ్యాలి. లేకపోతే జరిగే ఆపదను గురించి తర్వాత విచారించి లాభం లేదు,' యమదూత గంభీరంగా అన్నాడు.

మంత్రి సాధు కాసేపాలోచించాడు. అతనివెంట ఎక్కడికని వెళ్లడం! వెళ్తున్నట్టు నటించి దారిలో అతన్ని మోసగించడానికి ప్రయత్నించవచ్చు. కాని దగ్గర్లోనే మహారాజు ఉన్నట్టు అతను చెబుతున్నాడు. తామిద్దరూ ఈ పరిస్థితిలో మహారాజు కంటబడటం ఎంతయినా సిగ్గుచేటు.

'నీతో రావాల్సినంత అవసరం మాకేమీ లేదు. నువ్వు చెయ్యగలిగిందేమిటో చేసుకో,' మంత్రి అన్నాడు యమదూత వంక చూస్తూ.

ఈ మాట వినగానే యమదూతకు పట్టరాని కోపం వచ్చింది. ఇద్దరివంకా కళ్ళెర్ర చేసి చూశాడు. ఒక్కఅడుగు ముందుకు వేసి వాళ్లకు దగ్గరగా వచ్చాడు.

ఇంతలో కుడిచేతివైపు నించి పెద్ద కేక వాళ్లకు వినిపించింది. ముగ్గురూ ఆతురతగా ఆ ప్రక్కకు చూశారు.

ఒక వ్యక్తి ఆ వైపున్న. చెట్లలోంచి బయటికి వచ్చాడు. యమదూత వంక చూసి పరిహాసంగా నవ్వాడు. అతనిని చూడగానే యమదూత పై ప్రాణాలు పైనే పోయినంత పనయింది. ఎక్కడి వాడక్కడ నిశ్చేష్టుడై నిలబడి పోయాడు.

ఆ వ్యక్తి ఓసారి మహామాయ వంక, మంత్రి వంక చూశాడు.

'యమదూత సంగతేదో నేను చూసుకుంటాను. మ[illegible] మీరిక్కడినించి వెళ్లిపొండి. వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం కూడా లేదు,' అతనన్నాడు వాళ్లతో.

అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటన ఆ ఇద్దరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. అయినా జరిగిన దానికి అంతరంగంలో ఆనందిస్తూ మారుమాట్లాడకుండా ముందుకు సాగారు.

వాళ్లు వెళ్లిపోతుండగా యమదూత బాధగా ఓసారి వాళ్ల వంక చూశాడు. అయినా ఏమీ చెయ్యలేక మౌనంగా నిలబడి పోయాడు. ఆ వ్యక్తి అతనివంక చిరునవ్వుతో చూస్తూ నిలబడి పోయాడు.

ఇద్దరిలో ఎవరూ చాలా సేపటివరకు మాట్లాడలేదు. అప్పటికి మహామాయ, మంత్రి సాధు చాలాదూరం వెళ్లి చెట్లలో కలిసిపోయారు.

యమదూత చివరికి ఆ వ్యక్తివంక చూశాడు. అతని కళ్ళలో కంగారు కనిపించింది. ఆ వ్యక్తి అతనిని చూసి వికటంగా నవ్వాడు. కాని ఏమీ మాట్లాడలేదు.

## 3

ముసుగు యువతులు ముగ్గురూ నర్మద భవనంలోంచి బయలుదేరి వెనక్కి తిరిగి చూడకుండా అడవిలో ప్రయాణం సాగిస్తున్నారు. వాళ్లలా చాలాదూరం వెళ్ళి అకస్మాత్తుగా ఒకచోట ఆగారు. ఒకసారి నాలుగు ప్రక్కలకూ చూసి ఎవరూ తమను వెంటాడడం లేదని గమనించి స్వేచ్ఛగా గాలి పీల్చుకున్నారు.

'ఇక్కడినించి నేను విడిపోతాను. ఇంకా ఎక్కువదూరం మీతో రావడం ఎవరికీ మంచిది కాదు,' అందులో ఒక యువతి అంది.

'ఇక్కడ విడిపోయినా తర్వాత అవసరమైనప్పుడు నువ్వు మా సహాయాన్ని పొందవచ్చు,' మరొక యువతి ఆమెతో అంది.

'ఇక్కడినించీ నువ్వు ఎక్కడికి వెళ్తావు?' మూడవ యువతి మొదటి ఆమెనడిగింది.

'ఎక్కడికి వెళ్ళాలనేది నేనింకా నిర్ణయించుకోలేదు. తర్వాత ఆలోచించి ఎక్కడికి వెళ్ళాలనుకుంటే అక్కడికి వెళ్తాను. అవసరమైనప్పుడు మీ దగ్గరికివచ్చి కావలసిన సహాయం కోరతాను,' ఆమె సమాధానమిచ్చింది.

'అలాగే,' రెండవ యువతి అంది.

తర్వాత కాసేపు నిశ్శబ్దంగా గడచింది. ఎవరూ మాట్లాడ లేదు.

'మరి బయలుదేరదాం?' రెండవ యువతి అంది.

'ఎక్కడికి బయలుదేరి వెళ్లాలో నాకు తోచకుండా ఉంది,' మూడవ యువతి సమాధానంగా అంది.

'పోనీ మన మిద్దరం కలిసి వెళ్దాం. నాతో పాటు రండి. మా భవనంలో మీకెటువంటి లోటు పాట్లు జరగకుండా నేను ఏర్పాట్లు చేస్తాను,' రెండవ యువతి అంది.

మూడవ యువతి ఓసారి బాధగా చిరునవ్వు నవ్వి అంది.

'ఒకప్పుడు అతుల భోగ భాగ్యాల ననుభవించిన నేను ఈనాడు శత్రువుల మూలంగా ఇతరుల్ని ఆశ్రయించవలసి వచ్చింది. ఎలాగైనా ఆ శత్రువుల మీద పగ తీర్చుకోవడమే నా ఆశయం. అప్పటిదాకా నేను ఎవరిదగ్గరా ఎక్కడా స్థిరంగా ఉండదలచుకో లేదు. అడవిలోనే ఏదో స్థావ రాన్నేర్పరచుకుని అవసరమైతే ఆకులలములు తిని బ్రతుకు తాను.'

'ఇప్పుడంత అవసరమేం రాలేదుకదా?' రెండవ యువతి అంది.

ఈ ప్రశ్నకామె ఏమీ సమాధానమివ్వలేదు. ఒక్క నిమిషం నిశ్శబ్దంగా గడచింది. చివరికామె ముభావంగా అంది.

'సరే వెళ్దాం, పదండి.'

మొదటి యువతి తిన్నగా ముందుకు బయలుదేరింది. మిగి లిన ఇద్దరూ ఎడమచేతివైపుగా ప్రయాణం ప్రారంభించారు. కాసేపట్లో చెట్లలో కలిసిపోయారు.

నర్మద గూఢచారి రహస్యంగా వీళ్లను అనుసరిస్తూనే ఉన్నాడు. అక్కడక్కడ దాక్కుంటూ, చెట్లచాటుగా నడుస్తూ అతను వస్తున్నాడు. వాళ్లు ముగ్గురూ వెనక్కి తిరిగి చూసినప్పుడు కూడా కనిపించకుండా ఒక పెద్ద చెట్టు చాటున దాక్కున్నాడు.

వాళ్లు ముగ్గురూ మాట్లాడుకున్న విషయాలన్నీ అతనూ విన్నాడు. గొంతుల్ని బట్టి అతను ఒకరిద్దర్ని గుర్తు పట్టగలి గాడు కూడా. వాళ్ల సంభాషణను వినగానే అతనికి అంతు లేని ఆశ్చర్యం కలిగింది. మరో ప్రక్క విచారం అతని హృద యాన్నావరించింది.

ముగ్గురూ సంభాషణను ముగించి చెరో ప్రక్కకు బయలు దేరగానే ఆ గూఢచారికొక సమస్య ఏర్పడింది. ఎవరిని వెంటాడాలో అతనికి వెంటనే తోచలేదు. కాసేపాలో చించి చివరకతను మొదటి యువతి వెళ్లిన వైపు బయలు దేరాడు.

అది మధ్యాహ్నపువేళ. సూర్యుడు నడి ఆకాశంలోంచి తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఎండ బాగా తీవ్రంగా ఉంది. పశుపక్ష్యాదులుకూడా ఆ ఎండలో బయట తిరగడానికి భయపడుతున్నట్టున్నాయి.

అడవిలో ఎక్కడా సంచలనంలేదు. నిశ్శబ్దం అన్ని ప్రక్కలా ఆవరించింది. ఆ యువతి కొంతదూరం నడిచి వెళ్లి

అక్కడున్న ఒక చెట్టునీడను చతికిలబడింది. ఆనందంగా ఓసారి నాలుగు ప్రక్కలకూ చూసింది. తర్వాత నెమ్మదిగా ఎక్కడినించో చిన్న గుడ్డమూటను బయటికి తీసింది. ఆ మూట విప్పి తన ఎదుట పెట్టింది.

ఆ మూటనిండా విలువైన రత్నాలు, నాణాలు ఉన్నాయి. ఆమె వాటివంక మరింత సంతృప్తిగా సంతోషంతో చూసింది. చివరికి వాటిని మళ్లీ మూట కట్టింది.

మరుక్షణంలో ప్రక్కనే ఉన్న చెట్లచాటునుండి ఆ గూఢచారి ఆమె ముందుకు వచ్చాడు. అతనిని చూడగానే ఆమె ప్రాణాలు పోయినంత పనయింది. అయినా గుండెల్ని బిగ పట్టుకుని మాట్లాడకుండా కూర్చుంది. కంగారుపడి పోతున్న ఆమె చూపు అతని మొఖంమీదకి వెళ్లింది.

'యజమానురాలిని మోసగించి దొంగదానిలా ఇన్ని రత్నాలు తీసుకు పారిపోయి వచ్చావా? ఇటువంటి ద్రోహులు ఎప్పటికైనా పట్టుపడక పోరని నీకు తెలియదా?' అతన న్నాడు కొంచెం కోపంగా.

ఆమె ఒక్క క్షణంవరకు మాట్లాడలేదు. తర్వాత నెమ్మ దిగా అంది.

'నేను యజమానురాలికేమాత్రం ద్రోహం చెయ్యలేదు; ఎటువంటి దొంగతనమూ చెయ్యలేదు కూడా.'

'మరి ఈ రత్నాలు, నాణాలు నీ దగ్గరికెలా వచ్చాయి? అతను ప్రశ్నించాడు.

'నీకసలు సంగతి తెలియదనుకుంటాను. మీరిద్దరూ బయ టికి వెళ్ళిన కాసేపటికి క్రింద ఒక గదిలోంచి కోలాహలం

వినిపించింది. నేనక్కడికి పరుగెత్తుకు వెళ్ళాను. ఎవరో ముగ్గురు నలుగురు వ్యక్తులు మన భటులతో పోరాడుతూండడం నేను చూశాను. దొంగలై ఉంటారనుకున్నాను. కానీపటికి మన భటులందరు వాళ్ళ చేతుల్లో ప్రాణాలు వదిలారు. ఇంతలో ఆమెకూడా వచ్చింది. కాని ఆమెవల్లకూడా ఏమీ కాలేదు. పెద్ద కత్తిదెబ్బ తిని స్పృహతప్పి నేలమీద ఒరిగిపోయింది. ఇక అక్కడ నిలబడి లాభం లేదనుకున్నాను. ఎలాగైనా ప్రాణాలు నిలబెట్టుకోవాలనుకున్నాను. ఈ రత్నాలు, నాణాలు ఎక్కడున్నాయో నాకు తెలుసు. వాటిని దొంగల చేతులకి వదలిరావడమెందుకని నేను తీసుకువచ్చాను,' ఆమె అంది.

గూఢచారి వ్యంగ్యంగా మందహాసం చేశాడు.

'ఆ దొంగలు భవనంలోకెలా ప్రవేశించారంటావ్?'

'ఏమో!'

'ఇతరులెవరూ భవనంలోకి ప్రవేశించలేరన్న విషయం నీకు తెలుసుగా?'

'తెలుసు. అదే ఆలోచిస్తున్నాను. వాళ్లు లోపలికెలా రాగలిగారో ఎంత ఆలోచించినా నాకర్థం కాకుండా ఉంది.'

అతను మళ్లీ వ్యంగ్యంగా నవ్వాడు. 'ఎందుకిన్ని అబద్ధాలాడతావు! నిజం చెప్పు. ఆ వ్యక్తులెవరో నీకు తెలిసిన వాళ్లయి ఉండాలి,' అతనడిగాడు.

వాళ్లెవరో నాకు తెలియదు. నిజం. నామాట నమ్ము,' ఆమె బ్రతిమాలుతున్నట్టుగా అంది.

'అంతా అబద్ధం,' అతను కొంచెం కోపంగా బిగ్గరగా అరిచాడు.

ఇక మాట్లాడి లాభం లేదనుకుని ఆమె మౌనం వహించింది.

'ఆ భవనంలోంచి నీతోపాటు బయటికి వచ్చిన ఇద్దరూ, ఎవరు? వాళ్ళుకూడా ఇప్పుడు నువ్వు పగం ధరించిన ముసుగు లాంటి ముసుగులే వేసుకున్నారు,' ఆమె మౌనం వహించడం చూసి అతను అడిగాడు.

అతని ప్రశ్న వినగానే ఆమె మరింత కంగారుపడింది. అతను మొదటినించీ తమను అనుసరిస్తున్నాడన్న విషయం అప్పుడుగాని గ్రహించుకోలేకపోయింది. చివరికి హీన స్వరంలో అంది.

'ఆ ఇద్దరూ మనకు ఖైదీలుగా ఉన్నవాళ్ళే. మంజుల మంథర. వాళ్ళెలాగో ఖైదులోంచి తప్పించుకున్నారు.'

అతనామెవంక విచిత్రంగా చూశాడు.

'వాళ్ళను విడిపించింది నువ్వు కాదన్నమాట్రే నిన్ను నమ్మి ఖైదీలకు ఆహారాదులు తీసుకు వెళ్ళడానికి నిన్ను నియోగించి నందుకు ఇదా ఫలితం?' అతనన్నాడు కోపంగా.

'నేను వాళ్ళను విడిపెంచలేదు,' ఆమె అంది.

'మళ్ళీ అబద్ధమాడుతున్నావు. ఇంతవరకు తెలిసిం తర్వాత జరిగిన విషయాన్ని నేను ఊహించుకోగలను. నువ్వొక ద్రోహివి. తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టడానికి తెగబడ్డావు. ఈ పాపానికి తగిన ఫలితాన్ని వెంటనే అనుభవిద్దువుగాని,' అతను కోపంతో బిగ్గరగా అరుస్తూ అన్నాడు.

ఆమె అతని కాళ్లమీదపడి వలవల ఏడవసాగింది.

'బుద్ధి గడ్డితిని ఈ పనిచేశాను. ఈసారికి క్షమించు. ఇంక ఎప్పుడూ ఇలాంటి పని చెయ్యను,' ఆమె బ్రతిమాలింది.

'ఒకసారి పెద్ద తప్పుచేసినవాళ్లను క్షమించి వదలివెయ్యడం అంత తేలిక పనికాదు. అయినా నేను నిన్నేం చెయ్యను. నాతో రా, నిన్ను నర్మదగారి దగ్గరికి తీసుకువెళ్తాను,' అతను కొంచెం శాంతంగా అన్నాడు.

ఇంతలో గుర్రాల డెక్కలచప్పుడు వాళ్లకు వినిపించింది. ఇద్దరూ ఆ సవ్వడి వస్తున్నవైపు ఆతురతగా చూశారు. దూరాన రెండుగుర్రాలు వేగంగా తమవైపే వస్తూ వాళ్లకు కనిపించాయి. కాని ఆ గుర్రాలమీద ఎవరుందీ వాళ్లకు స్పష్టంగా తెలియలేదు.

'ఈ చెట్టుచాటున మనం దాక్కోవడం మంచిది. లేకపోతే వచ్చేవాళ్ళు శత్రువులైతే మనకపాయం కలగవచ్చు,' గూఢచారి ఇంకా గుర్రాలవంకే చూస్తూ అన్నాడు.

ఆమె అందుకు సరేనంది. గుర్రాలు ఇంకొంచెం ముందుకు వచ్చేసరికి వాళ్లిద్దరూ ఆ చెట్టుచాటుగా నిలబడ్డారు. పరీక్షించి చూస్తే తప్ప గుర్రాలమీద వచ్చేవాళ్లకు వీళ్లసలు కనిపించరు.

కాసేపటికి గుర్రాలు ఆ చెట్టును సమీపించాయి. గూఢచారి గుర్రాలమీద ఎవరున్నారో అని ఆతురతగా చూశాడు. మరుక్షణంలో ఆనందాశ్చర్యాలతో చెట్టు చాటునుండి ఇవతలికి వచ్చాడు. వేగంగా వస్తున్న గుర్రాలకు ఎదురు నడిచాడు.

ఆ గుర్రాలమీద వస్తున్న నర్మద, భవాని తమ గూఢచారిని అక్కడ చూడగానే కళ్ళాలు లాగిపట్టారు. ఏమిటి విశేషాలన్నట్టుగా నర్మద అతనివంక చూసింది.

'ముందు గుర్రాలు దిగండి. కొంచెం మాట్లాడాల్సిన పని ఉంది,' అన్నాడు గూఢచారి.

నర్మద, భవాని గుర్రాలమీదినించి దిగారు. ముగ్గురూ ఆ చెట్టుదగ్గరకు వెళ్ళారు. అక్కడ చెట్టుచాటున తన దాసీలలో ముఖ్యురాలిని చూడగానే నర్మదకు ఆశ్చర్యం కలిగింది.

నర్మదను చూడగానే ఆ దాసి భయంతో వణకిపోసాగింది. ఆమె అలా వణకిపోవడానికి కారణం తెలియక నర్మద ఆశ్చర్యంగా ఆ గూఢచారిమీదికి తన దృష్టిని పోనిచ్చింది. భవాని కూడా సంగతి సందర్భాలు తెలియక అతనివంక చూసింది.

అతను నర్మద భవనాన్ని గురించి, అక్కడ జరిగిన సంఘటనలను గురించి, తర్వాత తాను ఈ దాసీని అనుసరించి పట్టిన విషయాన్ని గురించి తనకు తెలిసినంతవరకు పూర్తిగా వివరించి చెప్పాడు.

తన భవనంలో జరిగిన విచిత్ర సంఘటనలను గురించి వినగానే నర్మదకు చాలా ఆశ్చర్యం కలిగింది. వెంటనే పూర్తి వివరాలు తెలుసుకోవాలనిపించిందామెకు. భయంతో వణకిపోతున్న ఆ దాసీవంక చూసి నెమ్మదిగా అంది.

'మొదటినించీ నమ్మకంగా ప్రవర్తించడంవల్ల నీకు ఖైదు గదులతాళపు చేతులిచ్చాను నేను. ఖైదీలకు ఆహారాదులు సమర్పించడానికి నిన్ను వినియోగించాను. అందుకు ఫలితంగా ఈనాడు నువ్వీపని చేశావు. ఎన్నడూ అనుకోని ద్రోహం నా

పట్టు తలపెట్టావు. సరే. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు విచారించి లాభంలేదు. అసలు జరిగిన విషయాలు నాకు చెప్పు. నిజం చెబితే నిన్ను క్షమించి ఈసారికి వదిలేస్తాను.'

దాసి దానికి ఈ మాటలు వినడంతో ప్రాణం లేచివచ్చి నట్టయింది. నర్మద కాళ్లమీదపడి కాసేపు విలపించింది. తర్వాత నెమ్మదిగా అంది.

'బుద్ధి చలించడంవల్ల డబ్బు కాశపడి మీకు ద్రోహం చెయ్యడానికి పూనుకున్నాను. మొదటిసారి నేను చేసిన ఈ తప్పును నన్ను మీరు మన్నించాలి. ఇకముందెన్నడూ ఇలాంటి పని చెయ్యను.'

'ఈ సంగతులన్నీ తర్వాత. ముందసలేం జరిగిందీ చెప్పు,' నర్మద కొంచెం కోపంగా అంది.

'మీరు ఆజ్ఞాపించిన ప్రకారం ఖైదీలకు స్వయంగా నేనే ఆహారాదులు సమకూరుస్తూ వచ్చాను. వాళ్లతో బాగా పరిచయమేర్పడింతర్వాత వాళ్లు నాకు డబ్బు, నగలు ఆశ గొల్పి తమనెలాగైనా ఖైదులోంచి వదలమని కోరసాగారు. నేను చాలాకాలం వాళ్ల మాటలు లక్ష్యపెట్టలేదు. కాని చివరికి వినగా వినగా నా మనస్సుకూడా చలించింది. వాళ్లు నాకెంతో డబ్బిస్తామనీ, సుఖంగా బ్రతికేట్టు చేస్తామనీ ఆశలు గొలిపారు. వాళ్లనెలాగైనా విడిపించడానికి చివరికి నేను పూనుకున్నాను. సమయంకోసం ఎదురు చూడసాగాను.

'ఉన్నట్టుండి ఈ రోజు ఉదయం భవనంచుట్టూ ఉన్న చెరువులో నీరు తగ్గిపోసాగింది. ఆ నీరలా తగ్గిపోవడానికి కారణం నాకు తెలియలేదు. చివరికి చాలా నీరు తగ్గిపోయి

తీగెలవల బయట పడింది. అప్పుడే నా మనస్సులో మంథరను, మంజూలను వదిలివేయాలని బుద్ధి పుట్టింది. అయితే, నాకెటువంటి ఆపదా రాకుండా చూసుకోడానికి నేను ప్రయత్నించాను. మూడు ముసుగులు సంపాదించాను. అందులో రెండు వాళ్ళిద్దరికీ ఇచ్చాను. వాళ్లను ఖైదులోంచి వదిలాను. వాళ్లు బయటికి వస్తుండగా భటులలో ఎవరో చూశారు. వాళ్ళు భటులను ఎదుర్కోవలసి వచ్చింది. కాసేపటికి భటులందరూ సమసిపోయారు. ఆ సమయానికి పద్మిని గారు అక్కడికి వచ్చారు. కాని ఆమెకూడా మంథర చేతిలో గాయపడి నేలమీద స్పృహతప్పి పడిపోయారు.

'ఈలోపల నేను రత్నాలను, హారాలను మూట కట్టి దాచుకున్నాను. చివరికి వాళ్ళిద్దరితో పాటు పడవమీదికెక్కి బయటికి వచ్చేశాను. అడవిలో చాలాదూరం వచ్చింతర్వాత వాళ్ళు ఎడమచేతివైపుకు తిరిగి వెళ్ళిపోయారు. నేను తిన్నగా వచ్చి ఈ చెట్టుక్రింద కూర్చున్నాను. ఇంతలో ఇలను కనిపించావు.'

నర్మద ఆ సంగతులన్నీ విని కాసేపాలోచించింది. భవాని వైపొకసారి చూసింది.

'ఎంత ఆలోచించినా ఆ చెరువులోని నీరు తగ్గిపోవడానికి కారణం నాకు తెలియడం లేదు. చెరువులోకి నీరు రావడానికి, చెరువులోంచి నీరు పోవడానికీగల మార్గాలు నాకు మాత్రమే తెలుసు. నేను మరెవరికీ చెప్పలేదుకూడా,' ఆమె కొంచెం బాధగా అంది.

'ఒకసారి అక్కడికివెళ్ళి పరిస్థితులు గమనిస్తే బాగుంటుంది,' భవాని అంది.

'అలాగే చేద్దాం,' అంటూ నర్మద గూఢచారివంక చూసింది.

'మేమిద్దరం గుర్రాలమీద భవనం దగ్గరికి వెళ్తాం. నువ్వు ఈ దాసీని తీసుకుని అక్కడికి రా,' ఆమె అతని నాజ్ఞాపించింది.

అతను మౌనంగా తల ఊపాడు. నర్మద, భవాని వల్లీ గుర్రాలెక్కి ముందుకు సాగారు. కాసేపట్లో కనుచూపు కందకుండా పోయారు.

## 4

నర్మద భవనంలో కాసేపు నిశ్శబ్దం ఆవరించింది. చాల మంది భటులు మంథరతోను, మంజులతోను పోరాడి చనిపోయారు. కొందరు దాసీలు ప్రాణాలు కాపాడుకోవడం కోసం అక్కడక్కడా దాక్కున్నారు. కాసేపటివరకు ఎవరూ బయటికి రాలేదు.

కోలాహలం సన్నగిల్లిన తర్వాత కొంతసేపటికి దాసీలు భయం భయంగా తాము దాక్కున్న చోట్లనుండి ఇవతలికి వచ్చారు. ముసుగు వ్యక్తులు వెళ్ళిపోయారని పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతనే భవనంలో కొంచెం స్వేచ్ఛగా తిరగనారంభించారు.

ఆ ముసుగు మనుషులెవరో మాత్రం వాళ్లకు తెలియలేదు. శత్రువులెవరో అయి ఉంటారని వాళ్ళు భావించారు. గబ

గబా అన్ని గదులలోకి వెళ్ళి వాళ్ళు పోయిన వస్తువులను గురించి అంచనాలు వేయసాగారు.

నర్మద గదిలోంచి కొన్ని రత్నాలు నాణాలు పోయినట్టు ఒకదాసి కనుక్కొగలిగింది. మరొక దాసి ఖైదులోంచి మంథర, మంజుల తప్పించుకు పోయినట్టుగా తెలుసు కుంది.

ఈ సంగతులు తెలిస్తే నర్మద ఎంతగా మండిపోతుందో అని లోలోపల భయపడుతూ అందరూ ఏం చెయ్యాలా అని ఆలోచించ సాగారు. ఎంత ఆలోచించినా వాళ్ళకేమీ తోచ లేదు. పోనీ ఈ విషయం తెలియచేయడానికైనా నర్మద ఎక్కడుందీ వాళ్ళకు తెలియదు.

దాసీలందరూ ఈ ఆలోచనలో మునిగి ఉండగా మళ్ళీ బయటనించి ఏదో కోలాహలం వాళ్ళకు వినిపించింది. తిరిగి అందరూ కంగారుపడిపోయారు.

బయటికివచ్చి ఏమిటో సంగతి అని చూశారు కొందరు. వాళ్ళ కంగారుకు అంతులేకపోయింది. కొందరు భటులు పడవమీద భవనంలోకి రావడం వాళ్ళు చూశారు. ఆ భటులు తమకు శత్రువులో మిత్రులో వాళ్ళకు తెలియదు. అయినా ఇదివరకెన్నడూ వాళ్ళను చూసి ఉండకపోవడంవల్ల శత్రువులే అయి ఉంటారని భావించారు.

ఎవరి ప్రాణాలు వాళ్ళు కాపాడుకోడానికి తలో ప్రక్కకూ పరుగుతీశారు దాసీలు. క్షణంలో ఎక్కడివాళ్ళక్కడ మాయ మయ్యారు. భవనమంతా నిర్మానుష్యంగా కనిపించ సాగింది.

ఆ భటులు పడవమీదనించి దూకి తిన్నగా భవనంలో ప్రవేశించారు. యథేచ్ఛగా అన్ని చోట్లా తిరుగుతూ చివరికి ఖైదు గదులదగ్గరికి వెళ్ళారు. ఓసారి గదులవైపు చూశారు.

'ఖైదు గదులన్నీ తెరచి ఉన్నాయి. ఎవరూ లేరు. మన వాళ్ళందరూ ఏమయ్యారో!' అందులో ఒక భటుడు అన్నాడు.

'ముందుగానే జాగ్రత్త పడి నర్మద భటులు వాళ్ళనెక్కడికైనా తీసుకుపోయారేమో,' మరొక భటుడు సందేహంగా అన్నాడు.

'లేకపోతే ఒకవేళ ఆ ఇద్దరూ ఎలాగైనా తప్పించుకుపోయారేమో,' ఇంకొకతనన్నాడు అనుమానంగా.

'అసలు భవనంలో భటులుగాని ఇతరులుగాని ఎవరూ ఉన్నట్టుగా లేదు,' మొదటి భటుడన్నాడు మళ్ళీ ఓసారి తన దృష్టిని అన్ని వైపులకీ పోనిచ్చాడు.

'చెరువులో నీరు తగ్గిపోవడంచూసి అందరూ ఇక్కడినించి వెళ్ళిపోయి ఉంటారు,' రెండవ అతను అన్నాడు.

'అక్కడ ఆ గదిలో కొందరు భటులు చచ్చిపడి ఉన్నట్టున్నారు. చూడండి,' మూడవ భటుడు కొంచెం ఆశ్చర్యంగా అన్నాడు.

మిగిలిన ఇద్దరిదృష్టి ఆ ప్రక్కకు తిరిగింది. ముగ్గురూ ఆ గదిలోకి నడిచారు. ఆ గది రక్తంతో నిండిఉంది. అనేకమంది భటులు చచ్చిపడి ఉన్నారు. కొందరి చేతుల్లో కత్తులింకా ఉన్నాయి. మరి కొందరి చేతుల్లోంచి కత్తులు జారి ప్రక్కగా పడిపోయాయి.

'పద్మినికూడా ఇక్కడే పడి ఉంది!' ఒకతనన్నాడు ఆమె వంక చూడగానే.

'ఆమె చనిపోయినట్టు లేదు,' మరొకతను తన సందేహాన్ని వెలిబుచ్చాడు.

మూడవవ్యక్తి ఆమె చేతినాడిని పరీక్షించాడు.

'ఇంకా ప్రాణం పోలేదు. తలమీద బలమైన గాయం ఏర్పడడంవల్ల స్పృహతప్పి పోయిందంతే,' అతనన్నాడు.

'అయితే ఆమెను స్పృహలోకి తెప్పిస్తే మంచిది. నయానో భయానో మంథర, మంజుల ఎక్కడ ఉందీ తెలుసుకోవచ్చు,' రెండవవ్యక్తి అన్నాడు.

'వాళ్ళింకా ఈ భవనంలోనే ఎక్కడైనా ఉన్నారని మీకు అనుమానంగా ఉందా?' మొదటి భటుడు నవ్వుతూ అన్నాడు.

'ఆ సంగతి అలా ఉంచండి. అసలు ఇక్కడ ఇంతమంది భటులు చచ్చిపడి ఉండడానికి కారణం నాకు తెలియకుండా ఉంది. ఇక్కడికివచ్చి వీళ్లతో యుద్ధం చేసిందెవరై ఉంటారు?' మూడవ భటుడు సందేహంగా అన్నాడు.

'ఇక్కడ పడి ఉన్న భటులందరూ ఈ భవనంలో వాళ్ళు లాగే కనిపిస్తున్నారు. అందరూ ఒకేరకమైన దుస్తుల్లో ఉన్నారు. నర్మద భటులే అయి ఉంటారు. మరి వాళ్లతో యుద్ధం చేసిందెవరు?' రెండవ భటుడు ఆలోచిస్తూ అన్నాడు.

ఒకవేళ ఎవ్వరైనా వచ్చి వీళ్లను హతమార్చి మంథరను, మంజులను విడిపించుకు వెళ్ళారేమో,' అనుమానంగా అన్నాడు మొదటివ్యక్తి.

'మరి ఈ మెకు స్పృహ తెప్పించడమా వద్దా!' ఒకతను ప్రశ్నించాడు.

ముగ్గురూ కాసేపు మౌనంగా ఆలోచించారు. అసలు ఆ భవనంలో ఏం జరిగిందో ఎంత ఆలోచించినా వాళ్లకు తెలియ లేదు. చివరికి మూడవవ్యక్తి ఇలా అన్నాడు.

'ఈ మెకిప్పుడు స్పృహ తెప్పించడం అంత మంచిపని కాదు. మనం ఈపనిలో మునిగిపోయి ఇక్కడ ఎక్కువసేపుంటే ఇంతలో నర్మదగాని తదితరులెవరైనాగాని రావచ్చు. అప్పుడు మనకు ఆపద తటస్థిస్తుంది. అందుచేత ఈ మెను ఇలాగే భుజాన వేసుకుని తీసుకువెల్దాం. మన ఖైదులో ఉంచి అక్కడే కొ[illegible]ల సిన విషయాలు ఈ మెద్వారా తెలుసుకోవచ్చు.'

అతని అభిప్రాయం మిగిలిన ఇద్దరికీకూడా సరయిందిగానే కనిపించింది. అలాగే చేద్దామని ముగ్గురూ నిర్ణయించుకున్నారు. పద్మినిని మొదటివ్యక్తి భుజాన వేసుకున్నాడు. ముగ్గురూ అక్కడినించి బయటికి నడిచారు. పడవదగ్గరకు వెళ్ళారు.

'చెరువులో నీరు మళ్ళీ పెరుగుతున్నట్టుంది,' ఆశ్చర్యంగా అరిచాడొకవ్యక్తి.

'అలాగే అనిపిస్తోంది. ఇందాక తీగెలవల బాగా కనిపించింది. ఇప్పుడు అంచులుమాత్రమే కనిపిస్తున్నాయి,' రెండవ అతనన్నాడు.

'మనం త్వరగా ఆ ప్రక్కకు వెళ్ళిపోవాలి. పడవ తిప్పి నడపండి,' అన్నాడు మొదటివ్యక్తి.

ముగ్గురూ పడవలో అవతలి ప్రక్కకు బయలుదేరి వెళ్ళి పోయారు. పడవమీదనించి దిగి చెరువు గట్టుమీదికెక్కారు.

ఒకసారి భవనంమీదికి తమదృష్టిని పోనిచ్చారు. ప్రశాంతంగా ఉంది భవనం.

చెరువులోకి మళ్ళీ నీళ్ళెలా వస్తున్నాయో! అంతా ఆశ్చర్యంగా ఉంది,' అన్నాడొకతను.

కాసేపటిలో తీగెలవల మునిగిపోయేటంత నీరు చెరువులోకి వచ్చేసింది. నీరు తగ్గిపోవడానికి ఎక్కువ సమయం పట్టింది కాని నిండడం మాత్రం కొద్దిసేపట్లోనే జరిగింది.

'ఇక వెళ్దాం,' అంటూ పద్మినిని భుజాన వేసుకున్న వ్యక్తి ఒక్కడుగు ముందుకు వేశాడు. మిగిలిన ఇద్దరూ అతనిననుసరించారు.

ఇంతలో పద్మినికి కొంచెం తెలివి వచ్చింది. ఆమె నెమ్మదిగా కదిలింది. ఆమె కదలడం గమనించిన ఆ వ్యక్తి కొంచెం కంగారుపడ్డాడు. ఆమెకుకూడా అకస్మాత్తుగా తెలివి రావడంతో తానెక్కడుందీ తెలియలేదు.

ఆ వ్యక్తి ఆమెను భుజంమీదినించి దింపాడు. ఎదురుగా ముగ్గురు వ్యక్తుల్ని చూసిన ఆమె కంగారుపడి కెవ్వుమని బిగ్గరగా అరచింది.

## 5

యమదూత చివరికి ధైర్యంచేసి ఆ వింత వ్యక్తితో అన్నాడు.

'నామీద పగ తీర్చుకోడానికి ఎలాంటి పని చేసినా బాగానే ఉండేది. కాని అనవసరంగా ఆ ఇద్దరినీ పంపిం

చేశావు. ఇలా చెయ్యడంవల్ల నేను నా వాళ్లకు ద్రోహం చేసినవాడినౌతున్నాను. ఇంతకంటే ఘోరమైన అపరాధం మరొకటి లేదు.'

ఆ వ్యక్తి పరిహాసంగా బిగ్గరగా నవ్వాడు.

'ఇలాంటి ద్రోహాలు ఇదివరకు నువ్వు ఎంతమందికి చేశావో! వాటిముందు ఇదొక పెద్ద లెక్కలోది కాదు. ఎవరికో అక్కరలేదు. ఇంతకుముందు నీ చేతిలో చిక్కి నామూలంగా తప్పించుకుపోయిన వ్యక్తులకే నువ్వు ద్రోహంచేశావు.నమ్మించి మోసగించావు. అంతకన్నా ఇది పెద్ద నేరమంటావా ?' అతనన్నాడు.

'ఈ విషయాలన్నీ నువ్వు నాకు చెప్పనక్కరలేదు. మహామాయ, ఆమె అనుచరులు నాకెంత ద్రోహం చేశారో నాకు తెలుసు. అందుకోసమే వాళ్లకు తిరిగి ద్రోహం తలపెట్టాను. కాని ఇప్పుడు నాకు ఆప్తులుగా ఉన్నవాళ్లు నాకెన్నడూ అపకారం చెయ్యలేదు, నేను ద్రోహం చెయ్యడానికి. అందుచేతనే వాళ్లను వెళ్లిపొమ్మని నువ్వు చెప్పడం మంచి పని కాదంటున్నాను,' యమదూత అన్నాడు.

'నేను చేసిని పనిలోని మంచి చెడ్డలను నిర్ణయించవలసినవాడివి నువ్వుకాదు. నామీద అధికారం చలాయించే పరిస్థితిలో నువ్వు లేవు. నీమీద నాకు సంపూర్ణాధికారాలున్నాయి. నేనెలా చెబితే నువ్వలా చెయ్యాలి. అలా చెయ్యకపోతే కలిగే ఫలితం నీకు తెలుసు,' ఆ వ్యక్తి యమదూతవంక కొంచెం కోపంగా చూసి అన్నాడు.

యమదూత వెంటనే ఏమీ సమాధానమివ్వలేదు. కాసేపు మౌనం వహించి ఏదో ఆలోచించాడు. చివరికి తల ఎత్తి ఆ వ్యక్తికేసి చూశాడు.

'బెదురుతున్నంతసేపూ ఇంకా బెదిరిస్తూనే ఉంటారు మీరు. ఒకప్పుడు మీరంతా నన్ను చూసి గజగజా వణికిపోయే వాళ్లు ఈనాడు మీకు నడవడానికి కాళ్లు వచ్చాయి. అజ్ఞానంలో నేను చేసిన కొన్ని తప్పులు కారణంగా మీరు ఈనాడు నన్ను వేధించుకు తింటున్నారు—'

యమదూత తన మాటలు పూర్తి చెయ్యకముందే ఆ వ్యక్తి మరొకసారి గంభీరాట్టహాసం చేసి అన్నాడు.

'నీ ప్రగల్భాలు కట్టిపెట్టు. నిన్ను చూసి మేం ఏనాడూ భయపడిందిలేదు. నీలాంటి మూర్ఖుడికి భయపడాల్సినంత అవసరం మాకేమాత్రం లేదు. ఒకప్పుడు నీ శారీరకబలం చూసి కొంత జంకినా ఇప్పుడు ఆ విషయంలో భయపడాల్సిన ఆవశ్యకతలేదు. ఇక నువ్వు చేసిన అపరాధాల విషయం. మూర్ఖత్వంతో నువ్వు చేసిన పొరపాట్లను మేం మాపనులు చక్కబెట్టుకోవడం కోసం వినియోగించుకుంటున్నాం. ఇందులో తప్పేముంది!'

అతని మాటలు వినగానే యమదూతకు కోపం వచ్చింది. ఎంతకోరలు తీసిన పాములాఉన్నా యమదూతకు అతని అవహేళనా వాక్యాలు వినగానే చెప్పరానంత ఆగ్రహం కలిగింది. అయినా కొంచెం తమాయించుకుని అన్నాడు.

'సరే. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు వెనుకటి విషయాలన్నీ త్రవ్వుకుని ప్రయోజనంలేదు. ఇప్పుడుకూడా మూర్ఖ

త్వంవల్ల నే మహామాయను, మంత్రిని నా చేతుల్లోంచి వదులు కున్నాను. ఇంతకూ ఇప్పుడు నావల్ల జరగవలసిన పని ఏమిటంటావు?'

ఆ వ్యక్తి నవ్వాడు. అతను నవ్వుతున్నప్పుడల్లా యమదూతను గుండెల్లో బాణాలు గుచ్చుకుంటున్నట్లున్నా శాంతం వహించడం మంచిదని అంత బాధనూ సహిస్తున్నాడు.

'ఇప్పుడు నీకే పని అప్పచెప్పడానికీ నేను రాలేదు,' అతనన్నాడు.

'మరి దేనికి వచ్చినట్టు?' యమదూత ప్రశ్నించాడు.

'నువ్వు నాతో రావాలి.'

'ఎక్కడికి?'

'ఆ సంగతి నీకనవసరం. నేనెక్కడికి తీసుకువెళ్తే అక్కడికి రావాలి. నేనేం చెబితే అది చెయ్యాలి.'

ఈమాట వినగానే యమదూతకు పట్టరానంత కోపం వచ్చింది. ఉగ్రమూర్తిలా ఓసారి ఆ వ్యక్తివంక చూశాడు.

'నువ్వు రమ్మన్న చోటికి నేను రాను. ఏదైనా చేయవలసిన పని ఉంటే మాత్రం చేస్తాను. అంతే,' అన్నాడు యమదూత.'

'ఎదురు తిరగగల ధైర్యం ఇంకా నీకు ఉందన్నమాట,' ఆ వ్యక్తి కొంచెం కోపంగా అన్నాడు.

'అంతకుమించి గత్యంతరం లేనప్పుడు ఆ పనే చేస్తాను. ఇప్పుడు నీకు ఎదురు తిరిగినందువల్ల నాకు రాగల ఆపద మాత్రం ఏముంది! నేను ముఖ్యంగా భయపడేది వరేంద్రమహారాజు గూఢచారులకు. అదీ ఆయనపట్ల నేను చేసిన అపరాధం

కారణంగా. ఇప్పుడు నన్ను వాళ్లు తమ మిత్రుడుగా భావి స్తున్నారు. నేను చేసిన ఎటువంటి అపరాధాన్నయినా క్షమించడానికి వాళ్లు మాట ఇచ్చారుకూడా,' అన్నాడు యమదూత.

'ఎంత క్షమించినా నీమీది ఆగ్రహం వాళ్లకు తొలగి పోవడం అసంభవం. అంతే కాదు. పద్మిని విషయం నీకు తెలుసుననుకుంటున్నాను. ఆమె ప్రాణాలు మా గుప్పిటలో ఉన్న సంగతికూడా నువ్వెరుగుదువు. ఆమెకోసమైనా నువ్వు నేను చెప్పిన ప్రకారం చెయ్యాలి,' ఆ వ్యక్తి అన్నాడు.

'పద్మిని ఎవరో అసలు నాకు తెలియదు,' యమదూత కొంచెం ఆశ్చర్యంగా అన్నాడు.

'నన్ను దబాయించినందువల్ల లాభం లేదు. నువ్వెవరివో అన్న సంగతి ఆమెకు తెలిస్తే ఆమె నిన్నెంతగా అసహ్యించు కుంటుందో! ఐనా ఇప్పుడా సంగతులన్నీ అనవసరం,' ఆ వ్యక్తి ఏదో రహస్యాన్ని దాస్తూ యమదూతను భయపెట్టడం కోసం కొన్ని మాటలన్నాడు.

'ఆమె ఎవరో చెబితే బాగుంటుందికదూ?' యమదూత అన్నాడు.

'అసలు ఆమెనే మర్చిపోయావన్నమాట. సరే. పోనీ నన్నైనా గుర్తున్నానా?' ఆ వ్యక్తి వ్యంగ్యంగా ప్రశ్నించాడు.

'నిన్నుకూడా నేను సరిగా గుర్తుపట్టలేకుండా ఉన్నాను. అయితే నువ్వు ఫలానా అని మాత్రం నాకు తెలుసు. కాని నా ఉద్దేశం ప్రకారం నువ్వు ఎప్పుడో చనిపోయి ఉండాలి,' అన్నాడు యమదూత.

'ఎన్నడో చనిపోయాననుకున్న నేను ఈనాడిక్కడ ప్రత్యక్షం కావడం నీకు ఆశ్చర్యాన్ని కలిగించి ఉంటుంది. నీకు సంబంధించిన ముఖ్యరహస్యాలెవ్వో తెలిసిన నేను మరణించానని ఎంతో ఆనందించి ఉంటావు. కాని ఈరోజు నేను మళ్లీ కనిపించడంతో పాపం నీ అంచనాలన్నీ తల్ల క్రిందులైనట్టున్నాయు,' ఆ వ్యక్తి అన్నాడు.

'ఇన్నాళ్లు కనిపించకపోవడంవల్ల నిజంగా నువ్వు చచ్చిపోయావనే అనుకున్నా,' యమదూత నిరాశగా అన్నాడు.

'కాని చావలేదు. నువ్వు చేసిన క్షమించరాని అపరాధాలను వేలెత్తి చూపడానికి బ్రతికే ఉన్నాను,' అతను పరిహాసంగా అన్నాడు.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. అక్కడ నిశ్శబ్దం ఆవరించింది. రెండు నిమిషాలు గడచిన అనంతరం ఆ వ్యక్తి అన్నాడు.

'ఇప్పటికైనా పద్మిని ఎవరో నువ్వు గ్రహించే ఉంటావు. ఒకప్పుడు నువ్వు—'

అతను వాక్యం పూర్తి చెయ్యకముందే యమదూత అన్నాడు.

'చాలు. ఇంకా ఆ సంగతి చెప్పి నన్ను బాధించనక్కరలేదు. కాని ఆమె ప్రాణాలు హరించగల వస్తువు నీదగ్గర ఏముందో నాకు అర్థం కాకుండా ఉంది,' యమదూత అన్నాడు.

ఆ పెట్టెవంక చూడగానే యమదూతకెందుకో ఆశ్చర్యం భయం కలిగాయి. కంగారుగా అన్నాడు.

'ఇప్పుడు నాకేమీ చూపనక్కరలేదు.'

ఆ వ్యక్తి బిగ్గరగా నవ్వాడు.

'చూడకముందే భయపడిపోతున్నావన్నమాట. నువ్వు అవసరం లేదంటే నేను దీనిని విప్పి చూపించనులే. మరి ఇప్పుడైనా నేను చెప్పినట్టు వింటావా?' అతను యమదూతవంక చూస్తూ ప్రశ్నించాడు.

యమదూతకు పిచ్చి పట్టినట్టయింది. ఏనాడో తాను చేసిన పాపాలకు ఫలితాన్ని ఈనాడు అనుభవిస్తున్నట్టుగా అతను భావించసాగాడు. ఒకదానివెనుక ఒకటి ఆపదలు అతనిని తరుముకువస్తున్నాయి.

అతను మౌనం వహించి ఆలోచించసాగాడు. ఇంతకు ముందు ఒకప్పుడు తానెన్నో అపరాధాలు చేశాడు. అవి క్షమించరానివే. అవి బయటపడితే తనకు పుట్టగతులుండక పోవచ్చు. కాని తాను వాటినన్నిటిని ఎలాగో మాఫుచేసుకో గలిగాననుకున్నాడు. ఆ అపరాధాలను గురించి తెలిసిన వాళ్లను చంపి, ఆ అపరాధాలను వ్యక్తం చేసే వస్తువులను నాశనంచేసి తాను చేసిన అపరాధాలు బయటపడకుండా చేశాననుకున్నాడు.

కాని తన ఉద్దేశాలు సరయినవి కావు. ఇంకా తన అపరాధాలను బయల్పరచగలవాళ్లున్నారు. తానింకా కష్టాల నుండి గట్టెక్కలేదు. ఇంకా ఎన్నో ఆపదల ననుభవించాలి. ఎన్నో పనులు చెయ్యాలి.

ఇప్పటికే మనస్సుకు శాంతి లేకుండాపోయింది. ఈనాడు నర్మద సాయంవల్ల తాను కొంత తేరుకోగలిగాడు. ఇప్పుడా నర్మదకే వ్యతిరేకంగా పనిచెయ్యాల్సి రావచ్చు. ఏం చెయ్యాలో తనకేమీ తోచడంలేదు.

ఇలా నమ్మినవాళ్లకు ద్రోహం తలపెట్టడంకంటే పాపం మరొకటుండబోదు. ముఖ్యంగా నర్మద తనకెంతో సహాయం చేసింది. అనేక ఆపదల్లో తనకు తోడ్పడింది. అటువంటి వ్యక్తికి అపకారం చెయ్య పూనుకోవడం ఎంత అసహ్యకరమైన పరిస్థితి.

అలా చెయ్యడంకంటే ప్రాణాలర్పించడం మెరుగనుకున్నాడు యమదూత. కాని ఆలోచించి చూస్తే అదీ మంచి పనిగా అతనికి అనిపించలేదు. ఎలాగో తెలివితేటల నుపయోగించి శత్రువుల చేతిలోనుంచి తప్పించుకు బయటపడాలి కాని పిరికిపందలా ప్రాణాలనివ్వడం అతనికి నచ్చలేదు.

ఇంతవరకు ఎన్నో కష్టాలు గట్టెక్కిన తానిమాత్రం దానికింత కంగారుపడాలా! తన మానసిక బలహీనతను గమనించే శత్రువులిలా చేస్తున్నారు. శారీరకంగా తానెంత బలవంతుడైనా క్షణికాలైన ఆపదలకు తలొగ్గి చెయ్యరాని పనులు తాను చేస్తూవచ్చాడు. ఇక అలా ప్రతివ్యక్తికీ లొంగిపోకూడదు.

యమదూత తన మనస్సును అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నించసాగాడు. అతనెంతసేపటికీ మాట్లాడకపోవడం చూసి ఆ వ్యక్తి బిగ్గరగా అన్నాడు.

'ఏమిటాలోచిస్తున్నావు! నేనడిగిందానికి సమాధానం చెప్పవే?'

యమదూత తలెత్తి ధైర్యంగా ఆ వ్యక్తివంక చూశాడు.

'సరే. వెళ్దాం పద. నీతోపాటు ఎక్కడికైనా వస్తాను,' అన్నాడు.

యమదూత అకస్మాత్తుగా కనబరచిన ధైర్యానికి ఆ వ్యక్తి కొంత ఆశ్చర్యపోయాడు. అయినా ఆ ఆశ్చర్యాన్ని దిగమింగుకుని ఒకసారి చిరునవ్వు నవ్వాడు.

'నాతో రా,' అంటూ అతను వెనక్కి తిరిగాడు. యమదూత మౌనంగా అతనినను సరించాడు. ఇద్దరూ ప్రక్కనున్న దట్టమైన చెట్లలో కనిపించకుండా ముందుకు సాగిపోయారు.

# 6

నర్మద, భవాని గుర్రాలమీద వేగంగా భవనంవైపు ప్రయాణం సాగించారు. గూఢచారి, నగలు దొంగిలించిన దాసి వెనకే వడకన బయలుదేరి వెళ్లసాగారు.

కొద్దిదూరం వెళ్లగానే నర్మదకేదో గుర్తు వచ్చింది. కళ్లెం లాగి పట్టి గుర్రాన్ని ఆపింది. మరుక్షణంలో భవానికూడా ఆగిపోయింది. నర్మద అకస్మాత్తుగా ఎందుకాగిందో అర్థంకాక భవాని ఆమెవంక చూసింది.

'చెరువులో నీళ్లు తగ్గిపోతున్నాయని గూఢచారి అన్నాడు కదూ! నీరు పూర్తిగా తగ్గిపోయిందంటే మరీ ఆపాయకర పరిస్థితి ఏర్పడుతుంది. అందుచేత తిరిగి చెరువులోకి నీరు వెళ్లేట్టు చెయ్యాలి,' నర్మద అంది.

...తి ముందే చెబుతామనుకుని నీకు తెలియదా అని
...ను,' భవాని అంది.
...గారి చిన్న చిన్న విషయాలుకూడా సమయానికి
...ప్పుడు మనం మార్గం మార్చి కుడిచేతి ప్రక్కగా
... అంటూ నర్మద తన గుర్రాన్ని ఆ ప్రక్కకు

...ట్లో రెండు గుర్రాలూ ఆ అడవి చెట్లగుండా
...సుకుపోసాగాయి. చాలదూరం వెళ్లింతర్వాత
...ది గుర్రాల కద్దుతగిలింది.
...దిగు,' నర్మద భవానితో అందినించి తాను గుర్రం
...తూ. భవానికూడా గుర్రంమీదనించి దిగింది.
...ముందు నడుస్తుండగా ఇద్దరూ నది ఒడ్డున ఎగువకు
...రు. విశాలమైన శయ్యలో నది ప్రశాంతంగా ప్రవ
... ఒడ్డున పెరిగిన పెద్ద పెద్ద చెట్లు చల్లని నీడను,
...దిస్తున్నాయి. నదిలోని నీరు స్వచ్ఛంగా అందంగా

...లోంచే ఆ చెరువులోకి నీరు వస్తుంది,' నర్మద

...ఆశ్చర్యంగా ఓసారి నదివంక చూసింది. ఆనందంగా
... పీల్చి వదలింది.
... ఒడ్డున అనేకసార్లు నేను ప్రయాణం చేశాను.
...నవజీవితానికి ఎంతగానో ఉపయోగించే పరిక

'ఆ చెరువులోంచి వదలిన నీళ్లు మళ్లీ ఈ నదిలోకే వచ్చి కలుస్తుందికూడా. అయితే ఆ నీరు మరోచోట వచ్చి కలుస్తుంది,' [illegible] నర్మద మళ్లీ.

'ఈ ఏర్పాటుగురించి కొంచెం వివరంగా చెబితే బాగుంటుంది,' అని అడిగింది భవాని.

'నువ్వే చూస్తావుగా,' అని ఊరుకుంది నర్మద.

కొద్దిదూరం నది ఒడ్డున వెళ్లింతర్వాత ఒకచోట నర్మద ఒడ్డుమీదినించి కొంచెం లోపలికి దిగింది. భవానికూడా ఆమె ననుసరించింది.

రెండు గజాలు దిగువగా వెళ్లింతర్వాత నర్మద నదిలోకి దిగింది. నీళ్లు మోకాటివరకు వచ్చాయి. కాసేపు నిలబడి తర్వాత ఆమె రెండు చేతులూ నీళ్లలోకిపోనిచ్చి దేనికోసమో వెదకింది. అలా ఒకనిమిషం గడచింది.

అకస్మాత్తుగా నర్మద నిలబడినచోట నీరు సుడిగుండంలా తిరగసాగింది. అది చూడగానే భవానికి కొంచెం ఆశ్చర్యం కలిగింది.

ఆమె ఏమీ అడగకముందే నర్మద అంది.

'ఇప్పుడు నీరు మన చెరువులోకి ప్రయాణం సాగిస్తోందన్న మాట.'

'ఎలా?' భవాని అడిగింది.

'క్రిందికి దిగి చూడు,' అంది నర్మద చిరునవ్వు నవ్వుతూ.

భవానికూడా నర్మద నిలబడి ఉన్న చోటికి వెళ్లింది. నీళ్లలో చేతులుపెట్టి ఏమిటో విశేషం అని కాసేపు వెదకింది.

ఏటవాలుగా ఉన్న ఒక చిన్న రాతిపలక భవానిచేతికి తగిలింది. అక్కడినించి ఒక చిన్న సొరంగం ఎక్కడికో ఉన్నట్టు ఆమె గమనించింది. ఆ పలక సొరంగంలోకి ద్వారమన్నమాట. పలక ఏటవాలుగా ఉంటే నీరులోపలికి ప్రవహిస్తుంది. దానిని నిలువుగా తిప్పితే నీరు లోపలికి వెళ్ళేమార్గం బందయిపోతుంది. ఆ పలకను ఏటవాలుగాను, నిలువుగాను అవసరాన్ని అనుసరించి త్రిప్పడానికి ఏర్పాట్లున్నాయన్నమాట.

భవాని మామూలుగా నిలబడి నర్మదవంక ఆశ్చర్యానందాలతో చూసింది.

'ఇక వెళ్దాం పద,' అంటూ నర్మద ఒడ్డుమీదికెక్కసాగింది. భవానికూడా నీళ్ళలోంచి బయటికి నడచింది.

'ఇప్పుడు తెలిసిందికదూ, చెరువులోకి నీరు వెళ్ళే ఏర్పాటు ఎలా ఉందో. ఇలాగే చెరువులోంచికూడా నీరు నదిలోకి రావడానికి ఏర్పాటుంది. నిలవనీరును పంపివెయ్యడానికి దాని నుపయోగించాలి. ఈ ఏర్పాట్ల విషయం ఇంతవరకు నాకు తప్ప మరెవరికీ తెలియదనుకున్నాను. నేనెవరికీ చెప్పలేదు కూడా. మరి ఇప్పుడు చెరువులోంచి నీరు తగ్గిపోతున్నదంటే ఇంకొకరికెవరికో ఈ సంగతి తెలిసి ఉండాలి,' నర్మద అంది.

భవాని ఏమీ మాట్లాడలేదు. ఇద్దరూ మౌనంగా నది ఒడ్డున కొంచెందూరం దిగువకు నడచి తమ గుర్రాల దగ్గరికి చేరుకున్నారు. సిద్ధంగా ఉన్న గుర్రాలెక్కి వెనక్కి ప్రయాణం సాగించారు.

'నాకొక చిన్న సందేహం కలిగింది,' అంది భవాని గుత్రాలు పరుగులు తీస్తుండగా.

'ఏమిటది?' నర్మద అడిగింది.

'నదిలోంచి నీరు సారంగంలోకి రావడానికి ఏర్పాటు ఉంది కదా! ఇటువంటి ఏర్పాటే చెరువుదగ్గర కూడా ఉందా?' భవాని తన అనుమానాన్ని వెలిబుచ్చింది.

'అలాంటిదేమీ లేదు. ఈ సారంగం తిన్నగా చెరువులోకి ఉంది. అక్కడ రాతిపలకలాంటివేవీ లేవు. ఇక్కడ నీరు వదలగానే తిన్నగా సారంగంగుండా చెరువులోకి ప్రవహిస్తుందా నీరు. ఈ సారంగం కూడా నది దగ్గరినించి చెరువు వైపుకు క్రమంగా పల్లంగా ఉంటుంది. అందువల్ల చెరువులోంచి నీరు వెనక్కి రావడానికవకాశం లేదు,' నర్మద సమాధానమిచ్చింది.

'మరి చెరువులోంచి నీరు వదలేటప్పుడో—?' భవాని మరొక సందేహాన్ని అసంపూర్తిగా వ్యక్తపరచింది.

'అప్పుడుకూడా ఇదేమాదిరిగా జరుగుతుంది. ఆ సారంగం చెరువులోంచి నదివైపుకు క్రమంగా పల్లంగా ఉంటుంది. అందుచేత నీరు చెరువులోంచి నదివైపు వెళ్తుంది. నదిఒడ్డున ఇక్కడిమాదిరిగానే పలక ఏర్పాటు ఉంది. ఆ పలక తెరవగానే సారంగంగుండా వచ్చిననీరు నదిలోకి వెళ్లిపోతుంది,' నర్మద ఆమె సందేహాన్ని తీర్చింది.

'కాబట్టి చెరువులోకి సారంగమార్గాలు తప్ప వేరే ఏర్పాట్లు లేవన్నమాట. నీరు రావడానికి, పోవడానికికూడా నదిలోనే ఏర్పాట్లు జరిగాయి,' భవాని తాను గ్రహించిన విషయాన్ని ఖాయపరచుకోవడం కోసం అంది.

'ఔను,' నర్మద తల ఊపింది.

'అయితే చెరువులోంచి నదివైపు వెళ్లే సొరంగంలో ఎప్పుడూ నీరు ఉంటుందన్నమాటేగా?'

'ఉంటుంది. అలా ఉన్నందువల్ల నష్టమేముంది! నదిలోని ఆ పలకను తెరిస్తేనే తప్ప నీరు నదిలోకి పోదు. అందాకా సొరంగమార్గంలో నీరు నిలవ ఉండిపోతుంది.'

ఇద్దరూ మాట్లాడుకుంటూ గుర్రాలమీద చాలాదూరం వచ్చేశారు. కబుర్ల సందట్లో వాళ్లకు భవనాన్ని సమీపించిన విషయమే తెలియలేదు.

'అదిగో మన భవనం. చాలా త్వరగా వచ్చేశాం,' అంది నర్మద అకస్మాత్తుగా భవనంమీదికి తనచూపు వెళ్లడంతోటే.

గుర్రాలింకా చెట్లమధ్యగా ప్రయాణం చేస్తూనే ఉన్నాయి. చెట్ల సందుల్లోంచి భవనం పైభాగం స్పష్టంగా కనిపిస్తోంది.

భవాని భవనంవంక ఓసారి సంతృప్తిగా చూసింది.

'ఈపాటికి చెరువులోకి నీరు వచ్చి ఉంటుంది,' అంది నెమ్మదిగా.

'ఔను. నీరు వచ్చే సొరంగం, నీరుపోయే సొరంగంకంటే చాలా పెద్దది. అందుచేత చెరువు నిండడానికి ఎక్కువసేపు పట్టదు. చెరువులోంచి నీరు బయటికి పోవడానికి మాత్రం ఎక్కువ కాలం పడుతుంది,' నర్మద అంది.

'అది ఒకందుకు మంచిదే. కాని చెరువులోకి కావలసినంత నీరు వచ్చిన తర్వాత నదిలోని ఆ పలకను మూసిరావద్దూ?' భవాని అడిగింది.

'ఇప్పుడు కాకేకాదు, నీవుకూడా ఆ స్థలం చూశావుగా. ఇద్దరిలో ఎవరో ఒకరు వెళ్లి అవసరమైనప్పుడు చూసిరా వచ్చు. కేవలం అదేకాదు, నీరు పోయేమార్గాన్నికూడా చూసిరావాలిగా,' నర్మద సమాధానమిచ్చింది.

'ఔను. ఆ సంగతి మర్చేపోయాను. కాని నాకు ఆ రెండో స్థలం ఎక్కడో తెలియదు మరి,' అంది భవాని.

'అదీ చూపిస్తాగా. ఒకటి చూపించిన తర్వాత రెండోది చూపించకుండా ఉంటానా?' నర్మద మందహాసం చేస్తూ భవానివంక చూసి అంది.

గుర్రాలు చెరువుగట్టును సమీపించాయి, ఇద్దరూ ఇప్పుడు మౌనంగా ప్రయాణం చేస్తున్నారు. మాట్లాడుకోవాల్సిన విషయాలేవీ లేవు. చుట్టూ నిశ్శబ్దం ఆవరించింది.

ఇంతలో ముందునించి ఒక ఆర్తనాదం వాళ్లకు వినిపించింది.

'ఎవరిదో స్త్రీ కంఠం. ఏదో ఆపదలో ఉన్నట్టుంది,' భవాని అంది.

'గుర్రాన్ని హెచ్చరించు,' నర్మద అంది.

రెండు గుర్రాలూ నాలుగు కాళ్లమీద పరుగెత్తసాగాయి. ఇద్దరూ ఆతురతగా ముందుకు చూశారు.

చెరువుగట్టుమీద ముగ్గురు భటులు వాళ్లకు కనిపించారు. క్రింద కూర్చొబడి ఉన్న యువతికూడా చూచాయగా వాళ్ల కంటబడింది.

పద్మినిలాగుంది,' నర్మద అంది.

భవాని ఆమెవైపు పరీక్షగా చూసింది. కాని తానిదివరకు ఆమెను చూసి ఉండకపోవడంవల్ల గుర్తుపట్టడం సాధ్యంకాక పోయింది.

ఇద్దరూ చెరువుగట్టును సమీపించేసరికి ముగ్గురు భటులూ అక్కడినించి పారిపోయారు.

'మనల్ని చూసి ఆ ముగ్గురూ పారిపోతున్నారు. వాళ్లను అనుసరించమన్నావా?' భవాని నర్మద నడిగింది.

నర్మద వాళ్లు పరుగెత్తినవైపు చూసింది. అప్పటికే వాళ్ళు చాలాదూరం వెళ్లి అక్కడ ఉన్న గుర్రాలనెక్కారు.

'వద్దులే. వాళ్లవెంట వెళ్లికూడా ప్రయోజనం ఉండక పోవచ్చు. ముందు ఇక్కడి పరిస్థితులు చూద్దాం.' అందామె.

ఇద్దరూ గుర్రాలమీదినించి దిగి పద్మిని కూర్చునిఉన్న చోటికి వెళ్లారు. ఆమెకూడా భవాని నిదివరకు చూసి ఉండ లేదు. ఐనా నర్మదను చూడగానే అకస్మాత్తుగా కలిగిన ఆనందంలో ఆమెముఖం వికసించింది. భవానివంక మరోసారి సందేహంగా చూసింది.

ఆమె చూపులోని ఉద్దేశాన్ని గ్రహించిన నర్మద భవానిని ఆమెకు పరిచయంచేసింది. పద్మినినిగురించి కూడా భవానికి చెప్పింది. ఇద్దరూ పరిచయ సూచకంగా ఆనందంగా చిరు నవ్వు నవ్వుకున్నారు.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. తర్వాత ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ నర్మద పద్మినితో అంది.

'ఏమిటిక్కడి విశేషాలు?'

నర్మదనూ, భవానినీ చూసిన ఆనందంలో గడచిన సంఘటనలను తాత్కాలికంగా మరచిపోయిన పద్మిని నర్మద అడిగిన ప్రశ్నకు ఉలిక్కిపడింది. ఒక్కసారిగా ఆమె ముఖంమీద విషాద మేఘాలావరించాయి. హీనస్వరంలో బాధగా నెమ్మదిగా అంది.

'నిన్నటివరకు అంతా సవ్యంగానే ఉంది. కాని ఈరోజే విచిత్ర సంఘటనలు జరిగాయి. వాటిని మీకెలా వివరించి చెప్పాలో నాకు తోచకుండా ఉంది.'

నర్మద ఆమెవంక చూసింది. ఆమె బాధపడుతున్నదని గ్రహించి నెమ్మదిగా అంది.

'కొన్ని విషయాలు నాకు ఇంతకు క్రితమే తెలిశాయి. అందుకోసమే మేం ఇక్కడికి వచ్చాం. అసలు విషయాలు వివరంగా నీద్వారా తెలుసుకుందామని అడిగాను. జరిగిందేదో జరిగిపోయింది. దానికోసం విచారించి లాభం లేదు. అసలు సంగతులేమిటో నాకు వివరంగా చెప్పు.'

పద్మిని ఆరోజు జరిగిన సంఘటనలన్నీ నర్మదకు వివరించి చెప్పింది. అన్నీ విన్నతర్వాత నర్మద అడిగింది.

'ఆ ముసుగు మనుష్యులెవరో తెలిసిందా?'

'ఎవరో నాకు తెలియలేదు.' పద్మిని సమాధానమిచ్చింది.

నర్మద తనకు తెలిసిన విషయాలన్నీ ఆమెకు చెప్పింది.

తర్వాత కొన్సేపక్కడ నిశ్శబ్దం ఆవరించింది. నర్మద ఏదో ఆలోచించి చివరికి పద్మినినిలా అడిగింది.

'ఇంతకు క్రితం నిన్ను ఎత్తుకుపోవడానికి ప్రయత్నించిన భటులెవరో గుర్తు పట్టగలిగావా?'

'వాళ్లెవరినీ నేనిదివరకు చూడలేదు. అందుచేత వాళ్లెవరో గుర్తుపట్టలేకపోయాను,' పద్మిని అంది.

'సరే. మేమిద్దరం వేరే పనిమీద వెళ్తున్నాం. ఇక్కడకు మణి గూఢచారి, ఆ దాసి వస్తారు. దాసీని బంధించి ఉంచు,' నర్మద ఆమెనాజ్ఞాపించింది.

'ఇక్కడి పరిస్థితులు మరీ బాగున్నట్టులేవు. మీరొకటి రెండు రోజులు ఇక్కడ ఉండి అన్నీ చక్కబెట్టుకువెళ్తే బాగుంటుంది,' పద్మిని అంది.

నర్మద చిరునవ్వు నవ్వింది.

'మళ్ళీ నేను త్వరలోనే వస్తాను. ఇక భయపడాల్సిన అవసరం ఉండదు. మిగిలిన సంగతులన్నీ నేను చూసుకుంటాలే,' ఆమె అంది.

నర్మద ఆమెకు ఎంత ధైర్యం చెప్పటానికి ప్రయత్నించినా ఆమె మనస్సింకా కుదుటపడలేదు. అందులోనూ ముఖ్యంగా మంజుల, మంథర తప్పించుకు పోయినవార్త విన్నప్పటినించి ఆమె బాధ ఇనుమడించింది.

ఐనా చెయ్యగలిగిందేమీ లేక నెమ్మదిగా అంది.

'సరే. త్వరలో ఓసారి వచ్చి అన్ని పరిస్థితులూ గమనించి వెళ్ళండి.'

నర్మద, భవాని మళ్లీ గుర్రాలదగ్గరికి వెళ్లారు. పద్మిని వాళ్లవంకే చూస్తూ చెరువు గట్టుమీద నిలబడిపోయింది.

కాసేపట్లో రెండు గుర్రాలూ విల్లునించి విడవబడిన తూణీరాల్లా అడవిలో ఒకదానివెనక ఒకటి పరుగెత్తసాగాయి.

# 7

యమదూత నెమ్మదిగా వెనక నడుస్తున్నాడు. ముందు ఆ వింతవ్యక్తి ప్రయాణం సాగిస్తున్నాడు. ఇద్దరిలో ఎవరూ మాట్లాడడం లేదు. మాట్లాడాల్సిన విషయాలన్నీ ముందుగానే ఐపోయాయి. అందుకే ఇద్దరూ మౌనం వహించారు.

అప్పటికి ఎండవేడి ఇంకా తగ్గలేదు. అయినా చెట్ల క్రిందుగా నడుస్తున్న వాళ్లకు అంతగా ఎండ తగలడంలేదు. అక్కడక్కడా ఎండ పడుతున్నా దానిని వాళ్ళు లెక్కపెట్ట నవసరం లేకుండా ఉంది.

ఇద్దరూ రెండు ఫర్లాంగులదూరం అలా నడిచారు. ఇంతలో యమదూత దృష్టి తమ వెనకే వస్తున్న మరో వ్యక్తి మీద పడింది. ఆ వ్యక్తివంక ఓసారి పరీక్షగా చూసి యమ దూత మళ్లీ ముందుకు తిరిగాడు.

'మన వెనక ఎవరో ఒకతను వస్తున్నాడు. ఎవరో నాకు తెలియడంలేదు. ఎక్కడా చూసినట్టు గుర్తులేదు,' అన్నాడు యదూత ముందు నడుస్తున్న వ్యక్తితో.

ఆ వ్యక్తి అకస్మాత్తుగా ఆగి ఆతురతగా వెనక్కి తిరిగి చూశాడు. ఆ మనిషి తమకొక నూరు గజాల దూరంలో ఉన్నాడు. అయినా చెట్ల చాటునించి వస్తున్న అతనిని గుర్తుపటడం కష్టంగా ఉంది.

'నాకూ అతనెవరో తెలియడంలేదు,' అన్నాడా వ్యక్తి.

ఇద్దరూ మళ్లీ ఓసారి వెనక్కి చూశారు.

'అతను మన వెనక ఎంతదూరంనించి వస్తున్నాడో?' ఆ వ్యక్తి అడిగాడు.

'ఏమో నాకు తెలియదు. ఇప్పుడు ఊరికే వెనక్కి చూస్తే అతను కనిపించాడు. మరి ఎంతదూరంనించి మనల్ని అనుసరిస్తున్నాడో,' అన్నాడు యమదూత.

'ఇక్కడ కాసేపాగి అతనెవరో చూద్దాం,' అన్నాడా వ్యక్తి.

ఇద్దరూ అక్కడో క చెట్టుక్రింద నిలబడ్డారు. కాసేపటికా వెనక వస్తున్న మనిషికూడా అక్కడికి చేరుకున్నాడు. చూడటానికతని ఆకారం వికృతంగా ఉంది. పొడుగాంటి మీసాలు, మచ్చలు పడిన ముఖం, ఉండలు కట్టిన జుట్టు. అతనిని చూడగానే ఈ ఇద్దరికీ అసహ్యం కలిగింది.

అతనుకూడా వీళ్ల దగ్గరికివచ్చి ఆగాడు.

'నీకోసమనే వస్తున్నాను. దగ్గర్లోనే కనిపించారు. ఎక్కువదూరం నడవాల్సిన అవసరం లేకుండా పోయింది,' అన్నాడతను.

యమదూత అతనివంక కొంచెం ఆశ్చర్యంగా చూసి అడిగాడు.

'మా ఇద్దరిలో ఎవరికోసమని ఇంతదూరం వచ్చావ్?'

'మీకోసం కాదు. ఆయనకోసం,' అన్నాడతను.

యమదూతను తీసుకువెళ్తున్న వ్యక్తికి ఈ వికృతంగా ఉన్న మనిషి ఇచ్చిన జవాబు వినగానే చాలా ఆశ్చర్యం కలిగింది.

'నాకోసమా! ఎందుకు? నువ్వెవరివో నాకు తెలియదే! నిన్నెక్కడా చూసినట్టుకూడా గుర్తులేదు,' అన్నాడు ఆ వికృతపు మనిషివంక పరీక్షగా మరోసారి చూసి.

'నేను మీకు తెలిసి ఉండకపోవచ్చు. అందుకాశ్చర్య పడాల్సిన అవసరంలేదు. కాని నాకు మీతో పని ఉంది,' అన్నాడా వికృతపుమనిషి.

'ముందు నువ్వెవరివో చెప్పు,' ఆ వ్యక్తి అడిగాడు.

'ఆ విషయం ఇప్పుడు చెప్పాల్సిన అవసరమేంలేదు. తెలుసుకున్నందువల్ల మీకు ప్రయోజనంకూడా ఏమీ ఉండదు,' ఆ మనిషి అన్నాడు.

'కనీసం నువ్వు మాకు శత్రుపక్షంలో వాడివో, మిత్రపక్షంలో వాడివో తెలుస్తుందిగా,' అతనన్నాడు.

'నేను మిత్రుడినీ కాదు; శత్రువునీ కాదు,' ఆ మనిషి వికటంగా నవ్వుతూ అన్నాడు.

'ఐతే నాతో నీకేం పని?' ఆ వ్యక్తి అడిగాడు.

'మీ దగ్గర ఉన్న ఆ చిన్న పెట్టె నాకు కావాలి. అది నాకివ్వండి,' ఆ మనిషి సమాధానమిచ్చాడు.

ఈమాట వినగానే యమదూతకు, ఆ వ్యక్తికీ ఆశ్చర్యం కలిగింది. ఆ వ్యక్తి కోపంగా ఓసారి ఆ మనిషివంక చూసి అడిగాడు.

'ఆ పెట్టెతో నీకేమిటి పని?'

'ఆ సంగతి మీకనవసరం. ఆ పెట్టె నాకు కావాలి. ఇవ్వండి,' ఆ మనిషి కటువుగా సమాధానమిచ్చాడు.

'నే నివ్వను.'

'ఇవ్వకపోతే అందుకు తగిన ఫలితాన్ననుభవిస్తావు.'

'ఏంచేస్తావు?'

'ఏంచేస్తానో నువ్వే చూద్దువుగాని.'

'ఐతే నేనివ్వను. నువ్వు చేసుకునేదేమిటో చేసుకో,' ఆ వ్యక్తి పట్టరాని కోపంతో అన్నాడు. యమదూతవంక చూసి అన్నాడు.

'వీడు మనల్నేంచేస్తాడు. వెళ్దాంరా.'

'ఆగండి.' ఆ మనిషి కేక పెట్టాడు. 'ఆ పెట్టె ఇవ్వరుకదూ!' అన్నాడు వెంటనే మామూలు పద్ధతిలో.

'ఇవ్వను, ఆ వ్యక్తి గట్టిగా నొక్కి చెప్పాడు.

మరుక్షణంలో ఆ వికృతపుమనిషి తనదగ్గర సిద్ధంగా ఉన్న ఏదో వస్తువును నేలమీద వేసికొట్టాడు. అది నేలమీద పడగానే పగిలిపోవడంతో పొగలాంటిదేదో పైకి గుప్పున లేచింది.

కాసేపటికి ఆ మనిషికాక మిగిలిన ఇద్దరూ స్పృహతప్పి నేలమీద ఒరిగిపోయారు. అతనోసారి అట్టహాసం చేసి ఆ వ్యక్తిదగ్గరకు వెళ్ళాడు. అతని దుస్తుల్లో వెదకి ఆ చిన్న పెట్టెను బయటికితీశాడు. దానిని తన దుస్తుల్లో దాచుకుని ఇద్దరివంకా చూస్తూ ఒక్కక్షణం నిలబడ్డాడు.

తర్వాత యమదూత దగ్గరికివెళ్ళి ఏదో వస్తువును అతని ముక్కుదగ్గర ఉంచాడు. వెంటనే యమదూతకు తెలివి వచ్చినట్టుంది. కళ్ళు తెరచి ఓసారి అటూ ఇటూ చూశాడు. ఎదురుగా ఆ వికృతపుమనిషి ఒక్కడే నిలబడి ఉండడం, ఆ రెండో వ్యక్తి పడిపోయి ఉండడం చూస్తే అతనికి అంతులేని ఆశ్చర్యం కలిగింది. తక్షణం లేచి నిలబడ్డాడు.

అతని మనస్సు అనేకవిధాలుగా ఆలోచించ సాగింది. తనను తీసుకుపోతున్న ఆ వ్యక్తి బలపరాక్రమాలలో సాటి

లేనివాడు. అటువంటివాడు కూడా ఈ మనిషి చేతిలో పడిపోయాడంటే ఇతడంతకు మించినవాడై ఉండాలి.

యమదూత మౌనంగా ఆలోచించుకుంటూండగానే ఆ వికృతపు మనిషి బిగ్గరగా నవ్వి అన్నాడు.

'ఆ వ్యక్తి స్పృహతప్పి పడిఉన్నాడంటే భయపడకు. నేను కొన్ని విషయాలడుగుతాను, వాటికి సమాధానాలు చెప్పు.'

ఆ వికృతపు మనిషి ఎవరో, అతనడిగే ప్రశ్నలకు తాను సమాధానాలివ్వవచ్చునో లేదో యమదూత ఆలోచించసాగాడు. కాని అతని ఆలోచన ఎంతసేపటికీ తెగడంలేదు. ఇంతలో మళ్లీ ఆ మనిషి అన్నాడు.

'నేనెవరో అని అనుమానిస్తున్నావా! నువ్వేమీ భయపడనక్కరలేదు. నేను నీ మిత్రవర్గంలోని వాడినే. నేను అడిగే ప్రశ్న కూడా పెద్ద విశేషమైందేమీ కాదు. ఈ వ్యక్తి ఎవరో, అతనికీ నీకూగల సంబంధమేమిటో చెబితే చాలు.'

యమదూత ఈమాటలు వినగానే ఆ మనిషివంక తేరిపార చూశాడు. కాని ఎంత ప్రయత్నించినా అతనెవరో తనకు గుర్తు రావడంలేదు. ఇదివరకెక్కడైనా చూసినట్టుకూడా అతనికనిపించడంలేదు. కాసేపాగి అతను నెమ్మదిగా అన్నాడు.

'క్షమించాలి. ఈ రెండు విషయాలు నా వ్యక్తిగత జీవితానికి సంబంధించినవి. వాటిని గురించి నేనెవరికీ చెప్పలేను.'

ఆ మనిషి మరోసారి బిగ్గరగా నవ్వాడు.

'నువ్వు ఇంత పిరికివాడిలా ప్రవర్తించడం వల్లనే ఇన్ని కష్టాల నెదుర్కోవలసి వస్తోంది. నేను నీ ఆప్తులలో వాడినని

చెప్పానుగా. ఐనా ఆ విషయాలు నాకు చెప్పడానికి భయపడుతున్నానన్నమాట,' అతనన్నాడు.

యమదూతకు కొంచెం కోపం వచ్చింది. కొన్ని పరిస్థితులు కారణంగా తాను పిరికిపంద అనిపించుకోవలసి వచ్చింది. అందరూ తనను హేళన చేస్తున్నారు. ఐనా తప్పదు. తన కోపాన్ని ఎలాగో అణచుకుని అతను హీనస్వరంలో అన్నాడు.

'ఆప్తులకు సైతం చెప్పరాని విషయాలవి. అందుచేతనే చెప్పలేకపోతున్నాను. లేకపోతే ఎప్పుడో చెప్పి ఉండేవాడిని. అయినా నేను చేసిన పనులే నన్నీస్థితికి తెచ్చాయి.'

'ఆ చేసిన పనులేమిటో ఆప్తులకి చెప్పి మనస్సును శాంత పరచుకుంటే పోతుందిగా'

'వాటినిగురించి వింటే ఎవరూ నన్ను క్షమించలేరు. అంత ఘోరమైన అపరాధాలు మరెవరూ చేసిఉండరు.'

'సరే. ఈ విషయాలన్నీ నాకెందుకు! ఈ వ్యక్తిని చూడగానే నువ్వెందుకంత భయపడిపోయావో చెప్పగలవా?'

'నేను చేసిన అపరాధాలను గురించి అతనికి తెలుసు. వాటిని అతను ఇతరుల ఎదుట బయట పెడతాడని నా భయం. అందుకే అతనిని చూడగానే వణకిపోవడం.'

'ఇప్పుడతని దగ్గరఉన్న చిన్న పెట్టెను నేను తీసుకున్నాలే. దానికోసం నువ్వంతగా తల్లడిల్లనక్కరలేదు.' అన్నాడు చివరికా వికృతపు మనిషి.

ఈమాట వినగానే యమదూతకు మరింత కంగారు కలిగింది. ఆ పెట్టె పడిపోయి ఉన్న వ్యక్తి దగ్గర ఉంటే తనకెంత నష్టం

కలగదేమో! ఇప్పుడు మరింత విపత్కర పరిస్థితి ఏర్పడింది.

యమదూత మాట్లాడకుండా ఆలోచించడం చూసి ఆ మనిషి అన్నాడు.

'నేనిప్పుడీ వ్యక్తిని తీసుకుని నర్మద దగ్గరకు వెళ్తున్నాను. ఇతని నామె భవనంలో శాశ్వతంగా బంధించాలి. తర్వాత ఇతనిద్వారా నీకెలాంటి ఆపదా కలగదుకూడా. నువ్వుకూడా నాతోపాటు ఆమె దగ్గరకు రా.'

నర్మద పేరెత్తగానే యమదూత కుంచించుకుపోయాడు. అతని భయంకరమైన ఆకృతి మారుతూపాన్ని పొందినట్టయింది. పులి పిల్లిగా మారింది.

ఆకారం ఎంత భయంకరంగా ఉన్నా అసలు స్వభావం ఎక్కడికీ పోదుగా. పిల్లి పిల్లకు పులివేషం వేసి మాత్రం ప్రయోజనమేముంది! యమదూత విశిష్టమైన స్వభావం కలవాడు. అందుచేతనే అతనెంత భయంకరంగా ఉన్నా కొందరికి పిల్లి పిల్లలాగే కనిపిస్తున్నాడు.

'ఇప్పుడు నేను ఆమె దగ్గరకు వచ్చిమాత్రం లాభమేమిటి?' అతనన్నాడు.

'ఆమెకుకూడా భయపడుతున్నావా?' ఆ మనిషి నవ్వుతూ అన్నాడు.

'లేదు. కాని కొంచెం పనిఉంది. ఓసారి రఘువీర్ మహారాజుగారిని కలుసుకోవాలి,' యమదూత అన్నాడు.

'తర్వాత కలుసుకుందువుగానిలే. నాతో రా. ముందు నర్మద దగ్గరికి వెళ్దాం. అక్కడ ఈ విషయాలన్నీ ఒకసారి మాట్లాడితే బాగుంటుంది,' అన్నాడా మనిషి.

యమదూత ఆలోచించసాగాడు. ఈ వికృతపు మనిషి ఎవరో, అతనికీ వర్మదకూ గల పరిచయమేమిటో అతను ఎంతకూ ఊహించుకోలేకపోతున్నాడు. చివరికి కొంచెం ధైర్యం తెచ్చుకుని అన్నాడు.

'సరే. వస్తాను. నువ్వెవరివో ముందు చెప్పకూడదూ!'

'నేనెవరినో కూడా ఆమెదగ్గరే తెలుసుకుందువుగాని. తొందరేనికి?' అంటూ ఆ మనిషి క్రిందపడిఉన్న వ్యక్తిని భుజాన వేసుకుని ముందుకు సాగాడు.

యమదూత అతని ననుసరించక తప్పలేదు. అతని మనస్సులో రకరకాల ఆలోచనలు మెదలసాగాయి. అతని గత జీవితమంతా కళ్ళముందు మళ్ళీ కదలిపోసాగింది. ఆ మనిషి వెనక మౌనంగా అతను నడవనారంభించాడు.

# 8

వర్మద గూఢచారి దాసిని వెంటపెట్టుకుని భవనంవైపు బయలుదేరాడు. చెట్లక్రిందుగా నెమ్మదిగా నడుస్తున్నారు వాళ్ళు. కొంతసేపటివరకు ఇద్దరూ మౌనం వహించారు.

దాసి చాలా కంగారు పడిపోసాగింది. తాను చేసిన నేరానికి వర్మద తనను క్షమించడం అసంభవం. అమె తనను క్షమిస్తానని చెప్పినా ఆ మాటమీద విశ్వాసముంచడం తెలివిగల పని కాదు. తాను చేసినపనికి మరెవరైనా అయితే వెంటనే కత్తికి బలిచేసి ఉండేవాళ్ళు. ఇప్పుడు వర్మద మాత్రం క్షమించి ఊరుకుంటుందన్న నమ్మకమేమిటి? అమె ముఖ్య

శత్రువులను తాను ఖైదులోంచి అనాయాసంగా వదిలింది. వాళ్లను మళ్లీ పట్టుకోగలగడం అంత తేలిక కాదు. ఇదివరకు ఎంత కష్టపడి వాళ్లను బంధించగలిగిందో ఆమె. అలాంటి స్థితిలో ఆమె తనను క్షమించి వదలగలదా! మాట అన్నదే గాని ఆ మాటను నిలబెట్టుకుంటుందా! దాసి మనస్సులో రకరకాల ఆలోచనలు మెదలసాగినాయి.

భవనంలోకి వెళ్లింతర్వాత ఆమె తన అపరాధానికి శిక్షను విధించవచ్చు. మిగిలిన అందరు దాసీల ఎదుట తను ఆ శిక్షను అనుభవించాల్సివస్తుంది. ఇంత నేరం చేసి తాను వాళ్లందరి ఎదుట తలెత్తుకు ఎలా నిలబడగలదు. తనకంటే తక్కువ స్థితిలో వాళ్లుకూడా తనను చూపి ఎగతాళి చేస్తారు. తాను అవమానంతో క్రుంగిపోవాల్సి వస్తుంది.

అంతకంటే ఎవరి చేతిలోనైనా ప్రాణాలర్పిస్తే మంచిదేమో! తీరా అక్కడికి వెళ్లింతర్వాత పర[illegible] తనను చంపమనే ఆజ్ఞాపించవచ్చు. అన్ని అవమానాలతో అక్కడ చావడంకంటే ముందుగానే ప్రాణాలు పోగొట్టుకుంటే మంచిది.

దాసి చివరికొక నిర్ణయానికి వచ్చింది. వెంటనే అక్కడ ఆగిపోయింది. ఆమె తనతోపాటు నడవకపోవడం చూసి గూఢచారి అడిగాడు.

'ఆగిపోయావేం? కాళ్ళు [illegible]గా ఉన్నాయా?'

ఆమె తల ఊపింది. 'నేను నీతో రాదలచుకోలేదు. అసలు నర్మదాగారి భవనంలో నేనిక అడుగు పెట్టదల్చుకోలేదు,' అంది.

ఈమాట వినగానే గూఢచారికి పట్టరానంత కోపం వచ్చింది.

'నన్నే మోసగించాలని చూస్తున్నావా? జాగ్రత్త. ప్రాణాలు తీసేస్తాను. మాట్లాడకుండా నాతోపాటు రా,' అతను గర్జిస్తూ అన్నాడు.

'అదే నాకు కావలసింది. నీతో పాటు భవనంలోకివచ్చి అక్కడ నలుగురిలో అవమానంతో ప్రాణాలు వదలడంకంటే ఇక్కడ నీ చేతుల్లోనే ప్రాణాలు వదలడం నాకు మంచిదిగా అనిపిస్తోంది,' ఆమె దీనంగా అంది.

అతను ఆ మాటల్లోని ఉద్దేశాన్ని గ్రహించాడు. శాంతంగానే అన్నాడు.

'తప్పు పని చేసేప్పుడే ఇవన్నీ ఆలోచించుకుని ఉంటే బాగుండేదిగా. ఇప్పుడైనా ముంచుకు పోయిందేమీ లేదులే. నర్మదగారు నిన్ను క్షమించి ప్రాణాలతో వదులుతానని మాట ఇచ్చారుగా.'

'ఆ మాటమీద ఎందుచేతనో నాకు విశ్వాసమేర్పడడం లేదు. అసలు ఇంతపనిచేసి అక్కడికి తలెత్తుకుని నేనెలా రాగలను!' దాని బాధపడుతున్నట్టుగా అంది.

గూఢచారి గంభీరంగా నవ్వాడు.

'ఈ విషయాలన్నీ ముందుగానే ఆలోచించుకుని ఉంటే బాగుండేదిగా. ఏది ఏమైనా ఇప్పుడు నువ్వు నాతో రాక తప్పదు. ఆమె ఆజ్ఞాపించినట్టు జరగాల్సిందే. నువ్వు నా వెనక నడచి రావడానికి ఇష్టపడకపోతే బలవంతానైనా తీసుకు వెళ్లడానికి ప్రయత్నిస్తాను,' అతనన్నాడు.

'నువ్వేమైనా చెయ్యి. నేను మాత్రం నీ వెనకరాను,' దాసి ఖచ్చితంగా సమాధానమిచ్చింది.

గూఢచారి ఏం చెయ్యాలో తోచక ఒక్క నిమిషం ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఇంతలో దాసి తనదగ్గర ఉన్న రత్నాల మూటను బయటికితీసి అతనితో అంది.

'దీనిని నువ్వు తీసుకువెళ్ళు. నేను మాత్రం రాను.'

ఆమెను తీసుకువెళ్లడం సంగతి అలా ఉంచి ముందు ఆ రత్నాలను తీసుకుని ఉండడం మంచిదనుకున్నాడు గూఢచారి. ఆ రత్నాల మూటను అందుకోడానికి చెయ్యి జాపాడు. ఆమె కూడా మూట అందించబోయింది.

ఆకస్మాత్తుగా ప్రక్కనున్న చెట్టుమీదినించి ఎవరో వాళ్లిద్దరి మధ్యకి దూకారు. దాసి చేతిలోని రత్నాలమూట ఆ వ్యక్తి దూకడంతో జారి నేలమీద పడింది. ఆ మూటను అందుకుని ఆ వ్యక్తి వెనక్కి తిరిగి చూడకుండా పరుగెత్తడం సాగించాడు.

ఆకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటన గూఢచారిని, దాసిని ఆశ్చర్యంలో ముంచింది. మరుక్షణంలో గూఢచారి 'నువ్విక్కడే ఉండు. ఇప్పుడే వస్తాను,' అని దాసితో అని ఆ వ్యక్తి వెనక పరుగుతియ్యనారంభించాడు. ఇద్దరూ ఒకరి వెనక మరొకరు పరుగెడుతూ చెట్లలో కలిసిపోయారు. చాలా దూరం వెళ్లిపోయారు.

దాసి అక్కడే నిలబడ్డింది. కాని ఐదునిమిషాలు గడచినా గూఢచారి జాడలేదు. వాళ్లు వెళ్ళినవైపు ఆమె తన నిశితదృష్టిని పోనిచ్చింది. కాని ఎవరూ కనిపించలేదు.

ఆమె మనస్సులో అనేక ఆలోచనలు పరుగులు తీశాయి. గూఢచారి ఎలాగో చాలాదూరం వెళ్లిపోయి ఉంటాడు. రత్నాలమూటకూడాపోయింది. తానూ ఎలాగైనా అతని బారి నుండి తప్పించుకుపోతే-అనుకుంది దాసి. తనకు సహాయం చెయ్యడానికి మంథర, మంజాల సిద్ధంగానే ఉన్నారు. వాళ్ల దగ్గర చేరి ఎలాగో తల దాచుకోవచ్చు.

ఈ ఉద్దేశం కలగగానే ఆమె ఓసారి నాలుగువైపులా పరీక్షించి చూసింది. ఎవరూ కనిపించలేదు. చెట్లమీద మరెవ్వరైనా దాగిఉన్నారేమోననే అనుమానంతో దగ్గరగా ఉన్న చెట్లపైనకూడా చూసింది. కాని ఎవరూ లేరు.

వెంటనే ఆమె ఎడమ చేతివైపుకు తిరిగి దారీ డొంకాలేని ఆ అడవిలో గబగబా నడవసాగింది. కొద్ది గంటల వ్యవధిలో జరిగిన సంఘటలను తల్చుకుంటూ ఆమె మైమరచి ముక్కుకు సూటిగా వెళ్ళిపోవడం మొదలు పెట్టింది.

గూఢచారి ముందు పరుగెత్తుతున్న ఆ దొంగను అనుసరించి పరుగెత్త నారంభించాడు. ఆ వ్యక్తి చెట్ల చాటుగా తప్పుకుంటూ గూఢచారి కందకుండా నానా తిప్పలూ పెట్టసాగాడు. ఎప్పుడు చూసినా వాళ్ళిద్దరికీ మధ్య చాలాదూరం ఉంటోంది. అతను దొరకడం అసంభవంగా కనిపించింది గూఢచారిక్కి. చివరికా వ్యక్తి వెనక పరుగెత్తి పరుగెత్తి అతను విసిగిపోయాడు కూడా.

అంతలో ఒక పెద్ద ఆర్తనాదం అతనికి వినిపించింది. ఆ ధ్వని వచ్చినవైపుకు అతను తలెత్తి చూశాడు. కొంచెం

దూరంలో రత్నాలమూట దొంగిలించి పారిపోతున్న వ్యక్తి నేలమీద పడిపోయి ఉన్నాడు.

అతనలా పడిపోవడానికి గల కారణం గూఢచారికి తెలియకపోయినా ఆ సంఘటన అతనికి అంతులేని ఆనందాన్ని కలిగించింది. గబగబా ఆ వ్యక్తిదగ్గరకు వెళ్ళాడు.

ఆ వ్యక్తి గుండెల్లో చిన్నకత్తి ఒకటి దిగబడి ఉంది. అతనా కత్తిని బయటికి లాగడానికి బాధతో కొన ఊపిరితో ప్రయత్నించసాగాడు. అతను దొంగిలించిన రత్నాలమూట అతని చేతుల్లోంచి జారి కాళ్ళదగ్గరగా నేలమీద పడి ఉంది.

గూఢచారి ఆ వ్యక్తివంక పరిశీలనగా చూస్తున్న సమయంలో ప్రక్కనించి అడుగులచప్పుడు అతనికి వినిపించింది. అతనా ప్రక్కకు తన దృష్టిని పోనిచ్చాడు.

అతనికి చెప్పరానంత ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. రఘువీర్ మహారాజు తనవైపుకి వస్తూండడం అతను చూశాడు. ఆయన దగ్గరకు రాగానే వినమ్రుడై నమస్కారం చేశాడు.

'ఎవరీవ్యక్తి?' ఆయన గూఢచారి నడిగాడు.

'నాకూ తెలియదండి,' అంటూ అతను జరిగిన సంఘటనలను వివరించి చెప్పాడు.

'అయితే వంచిపనే జరిగిందన్నమాట. నేనీదారిన పనిమీద వెళ్తున్నాను. అకస్మాత్తుగా నువ్వు పరుగెడుతూ కనిపించావు. ఆగి చూశాను నిన్ను తిప్పలు పెడుతున్న ఈ వ్యక్తికూడా కనిపించాడు. ఇతనెవరో నీకు శత్రువై ఉంటాడని నేనే అ

కత్తిని అతడిమీదికి విసిరాను. అది సరిగా అతని గుండెల్లో గుచ్చుకుంది,' అన్నాడు మహారాజు.

'దుర్మార్గుడికి మంచి శాస్తి జరిగింది. ఎవరో బందిపోటు దొంగ అయి ఉంటాడు,' అన్నాడు గూఢచారి.

ఇంతలో ఆ వ్యక్తి చివరిసారిగా మూలిగి ప్రాణాలు వదిలాడు. కత్తి గుండెల్లోంచి అతని చేతిలోకి వచ్చేసింది. గాయంలోంచి రక్తం ప్రవహించసాగింది.

'నువ్వు చెప్పిన సంగతులన్నీ విన్నతర్వాత నేనూ ఓసారి నర్తకి భవనానికివచ్చి చూడాలనిపిస్తోంది,' అన్నాడు మహారాజు.

'రండి వెళ్దాం. ఇక్కడికి ఎక్కువ దూరంకూడా లేదుగా,' అన్నాడు గూఢచారి ఆనందంగా ఆయన్ని ఆహ్వానిస్తూ.

'సరే పద,' అన్నాడు మహారాజు.

'దగ్గర్లోనే ఆ దాసి ఉంటుంది. ఆమెను తీసుకువస్తాను. మీరిక్కడే ఉండండి. అందరం కలిసి వెళ్దాం,' అన్నాడు గూఢచారి.

'నేనుకూడా వస్తాను పద. అటునించి అటే వెళ్దాం,' అన్నాడాయన.

ఇద్దరూ దాసి ఉండవలసినచోటికి బయలుదేరారు. గూఢచారి చనిపోయిన ఆ వ్యక్తి కాళ్లదగ్గర ఉన్న రత్నాలమూటను చేతిలోకి తీసుకున్నాడు. దారిలో ఎవరూ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నడచి వెళ్ళారు.

గూఢచారి, దాసి ఉండవలసినచోట కనిపించక పోవడంతో కంగారు పడిపోయాడు. ఓసారి నాలుగు ప్రక్కలా కలయజూశాడు. కాని ఎక్కడా ఆమె జాడ కనిపించలేదు.

'సమయం చూసి పారిపోయినట్టుంది. ఒట్టి చేతులతో వెళ్తే నర్మదగారు నామీద విరుచుకు పడతారు,' అన్నాడు భయం భయంగా గూఢచారి.

రఘువీర్ మహారాజు తనలో తానోసారి నవ్వుకున్నాడు. గూఢచారివైపు చూసి అతనికి ధైర్యం చెబుతూ అన్నాడు.

'జరిగిందానికి నువ్వేం చేస్తావు. వెళ్దాం పద. నర్మదతో అన్ని విషయాలూ నేను మాట్లాడుతాలే.'

చివరికి గూఢచారి ఆయనతో కలిసి నర్మద భవనానికి వెళ్లడానికే నిర్ణయించుకున్నాడు. దానికోసం వెదకే ప్రయోజనం ఉండదనుకున్నాడు.

ఇద్దరూ అక్కడినించి నర్మద భవనంవైపు ప్రయాణం సాగించారు. గూఢచారి మనసులోంచి ఇంకా భయం పూర్తిగా తొలగిపోలేదు.

## 9

నర్మద భవానిని వెంట పెట్టుకుని తాము అనుకున్న ప్రకారం నదిఒడ్డుకు వెళ్లింది. అప్పటికి సాయంకాలమైంది. వాతావరణం మరింత హాయిగా ఉంది. పశు పక్ష్యాదులన్నీ నిద్రలోంచి మేల్కొన్నట్టుగా ఉన్నాయి. చెట్లు సైతం ఆ నీరెండలో మరింత ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. నదిలోని నీటిమీదనించి వస్తున్న చల్లని గాలి కష్టాలలో మునిగివున్న వాళ్లను సైతం తాత్కాలికంగా మరపించేట్టుగా ఉంది.

ఒడ్డునించి దూరంగా చూస్తుంటే అనంతంగా వ్యాపించి ఉన్న ప్రకృతి వింత భావాలను కలిగిస్తోంది. దృష్టి దూరంగా పోయిన కొద్దీ ఆకృతులుకూడా మారుతున్నట్టగుపిస్తున్నాయి. దూరాన ఉన్న వస్తువులలో సమానత్వం కనిపిస్తోంది. ఎత్తు పల్లాలు సహజంగా ఉన్నా అంత దూరానికి అవి కనిపించడం లేదు.

'ముందు నీరుపోతున్న చోటికి వెళ్లి ఆ మార్గాన్ని బంధించి గావాలి,' అంది భవాని.

అలాగే,' అంటూ నర్మద వరోమార్గాన దిగువకు ప్రయాణం సాగించింది. భవానికూడా ఆమె ననుసరించింది.

చాలాదూరం వెళ్లింతర్వాత ఓచోట వాళ్లిద్దరూ గుర్రాలు దిగారు. నది ఒడ్డునే నడక ఆరంభించారు. కొద్దిదూరం వెళ్లింతర్వాత నర్మద ఆగి భవానితో అంది.

ఇదే ఆ స్థలం. నువ్వు ఇక్కడినించి నీటిలోకి దిగి చూసి రా.

భవాని ఒడ్డునించి నీటిలోకి దిగింది. అక్కడ నీటిలో ఒక చోట బుడగలు తేలుతూ ఆమెకు కనిపించాయి. రాతిపలక అక్కడే ఉంటుందని గ్రహించిన భవాని నీటిలో చేతుల్తో వెదకింది. చివరికామె చేతికాపలక దొరికింది.

'పలక కనిపించింది. నీరింకా వస్తూనే ఉంది. కట్టి వేస్తున్నాను,' అంది భవాని ఒడ్డున నిలబడి ఉన్న నర్మదవంక చూస్తూ.

ఆమె సరేనన్నట్టుగా తల ఊపింది. భవాని కాసేపట్లో ఆ పలకను మూసివేసి నీటిలోంచి బయటికి వచ్చేసింది.

'ఇక అక్కడికి వెళ్లాల్సిన పని ఉంది,' అంది ఒడ్డుకు రాంగానే భవాని నర్మదతో.

'అదే ఆలోచిస్తున్నాను. నేనొక చిన్న పనిమీద ఒక చోటికి వెళ్లి వస్తాను. ఈలోపుగా అక్కడికి వెళ్లి నువ్వా పని చూడు. నేను తిన్నగా అక్కడికి వస్తాను. తర్వాత భవనం లోకి వెళ్దాం,' అంది నర్మద.

'బాగా ఆలస్యం కాదు గదా,' భవాని సందేహంగా అంది.

'పెద్ద పనేం కాదు. కాసేపట్లో వచ్చేస్తాను.' అంది నర్మద.

మరుక్షణంలో ఇద్దరూ గుర్రాలమీద చెరో ప్రక్కకూ ప్రయాణం సాగించారు. నర్మద కనుచూపు దాటిపోయేవరకు నెమ్మదిగానే తన గుర్రాన్ని నడపిన భవాని తర్వాత తానూ వేగంగా ఎగువకు వెళ్లిపోసాగింది.

కాసేపటికి తన కార్యస్థానాన్ని చేరుకుని ఆమె తన పని ముగించుకుంది. కాని అప్పటికింకా నర్మద రాలేదు. ఆమె వచ్చేవలకు విశ్రాంతి తీసుకోవడంకోసం భవాని నది ఒడ్డునే ఒక పెద్ద చెట్టుక్రింద కూర్చుని చల్లగాలి అనుభవించనారంభించింది.

అలా కొంచెంసేపు గడచింది. ఆమె మనస్సు ప్రశాంతంగా ఉంది. ఎటువంటి ఆలోచనలూ మనస్సులో మెదలడం లేదు. ఇంచుమించుగా చాలవరకు [illegible] కష్టాలలోంచి బయటపడినట్టే. అసలు ముఖ్య విషయం ఒకటి మాత్రం మిగిలిపోయింది. మహామాయ తమ అసలు సోదరి కాకపోతే ఆమె ఏమైనట్టు! ఇప్పుడు మహామాయ ఏం చెయ్యడానికి ప్రయత్నిస్తోందో అని ఆమె ఓసారి తనలో తాను ప్రశ్నించుకుంది.

కాని అది ఈ సమయంలో ఆలోచించవలసిన విషయంగా ఆమెకు అనిపించలేదు.

ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ, ప్రకృతి ఇచ్చే హాయిని అనుభవిస్తూ ఆమె నిశ్చలంగా నిశ్చింతగా అక్కడ కూర్చుంది. దగ్గర్లో మనుష్యసంచారం లేనేలేదు.

అకస్మాత్తుగా ఆమె దృష్టి దూరంగా ఒక చెట్టు చాటున కదులుతున్న ఆకారంమీద పడింది. ఆ ఆకారం స్త్రీలా కని పిస్తున్నా ముఖం స్పష్టంగా కనిపించడంలేదు. ఆ వ్యక్తి ఇంకా దిగువకు నడచిపోతున్నట్టుంది.

ఆ మనిషి ఎవరైతే తనకేంలే అనుకుంది భవాని ముందు. కాని అక్కడ ఊరికే కూర్చుంటే ఏమీ తోచడంలేదు. ఓసారి నాలుగు ప్రక్కలకూ కలయచూసింది. కాని నర్మద వస్తున్న జాడ లేదు.

ఆ మనిషి ఎవరో ఒకసారి చూసివస్తే నష్టమేమిటి అనుకుంది భవాని. ఒకోసారి అనుకోకుండా లాభం కలగవచ్చుకూడా. పైగా చూసి వెంటనే వెనక్కి తిరిగి రావచ్చు. అనుకోవడమే తరువాయి ఆమె గుర్రంమీద ఆ స్త్రీ నడచి వెళ్తున్న వైపు బయలుదేరింది.

ఆ స్త్రీ దగ్గరికి సమీపించగానే భవాని ఆమెవంక ఆశ్చ ర్యంగా చూసింది. ఆమె ఇంతకుక్రితం నర్మద భవనంలోంచి రత్నాలు, నగలు దొంగిలించి పారిపోవడానికి ప్రయత్నించిన దాసి. ఆ దాసినక్కడ ఒంటరిగా చూడగానే భవాని ఆశ్చర్యం ఇనుమడించింది. ఆమెను వెంటపెట్టుకు రమ్మని నర్మద గూఢ చారి నాజ్ఞాపించింది. కాని ఆ చుట్టుప్రక్కల ఎక్కడా ఆతను

లేదు. ఏదో విశేషం జరిగి ఉంటుందని భవాని మనసులో అనుకుంది.

వెనకనించి గుర్రం పరుగెత్తుకు వస్తున్న చప్పుడు వినగానే దాసికూడా వెనక్కి తిరిగి చూసింది. అంతే. ఆమె పంచ ప్రాణాలు పోయాయి. శిలావిగ్రహంలా స్తంభించిపోయింది. కళ్లు మూసుకుపోయాయి. కాళ్లు తేలిపోసాగాయి. పరుగెత్తుదామనుకున్నా కాళ్లు కలిసి రావడంలేదు. పైగా తానెక్కడికి పరుగెత్తగలదు! వెనక ఆమె గుర్రంమీద వస్తున్నది.

ఆమె ఎవరో దాసికి తెలియకపోయినా నర్మదతోపాటు చూసి ఉండడంవల్ల ఆమెకు సంబంధించిన మనిషి అయి ఉంటుందని సులభంగా గ్రహించింది. తనకిక ఎలాగో చావు తప్పదని నిర్ణయించుకుంది. పరిస్థితులు తనకనుకూలంగా ఉన్నాయని ఇప్పటివరకు ఆనందిస్తున్న దాసి మనస్సులో ఇప్పుడనేక విధాల వాపోవసాగింది.

భవాని దాసిని సమీపించగానే గుర్రంమీదినించి దిగింది. ఆమె దగ్గరకు వెళ్లి అడిగింది.

'గూఢచారి ఎక్కడ?'

దాసి మాట్లాడలేదు. భయంతో వణికిపోసాగింది. ఏం చెప్పడానికీ తోచడంలేదు. అసలేం చెప్పగలదు!

దాసి కంగారు పడిపోవడం చూసి భవాని మరింత గట్టిగా అంది.

'మాట్లాడవేం? గూఢచారి ఏమయ్యాడు? నువ్వు ఒంటరిగా ఇటు ఎక్కడికి వెళ్తున్నావు?'

ఏదో ఒక విషయం చెప్పక తప్పని పరిస్థితి ఏర్పడింది. తామిద్దరూ భవనానికి నడచివస్తుండగా దారిలో ఎవరో తమ దగ్గరఉన్న రత్నాలమూటను ఎత్తుకుపోవడం, గూఢచారి అతనివెనక పరుగెత్తుకు వెళ్లడం మొదలైన విషయాలు హీన స్వరంలో చెప్పింది. తర్వాత నెమ్మదిగా ఇలా అంది.

'ఆ గూఢచారి ఎంత సేపటికీ తిరిగి రాలేదు. నేను అదే స్థలంలో చాలసేపు నిలబడి అతనికోసం ఎదురుచూశాను. కాని అతనెంతకూ రాకపోవడంతో నాకు భయం కలిగింది. వాళ్లిద్దరూ పరుగెత్తుకు వెళ్ళినవైపు వెదకుతూ బయలుదేరాను. ఎంత వెదకినా ఎవరూ కనిపించలేదు. చట్ట చివరికి నేనా అరణ్యంలో దారి తప్పిపోయాను. భవనంవైపుకు ఎటు వెళ్ళాలో తెలియక అటూ ఇటూ తిరుగుతున్నాను. ఇంతలో మీరు కనిపించారు.'

దాసి చెప్పిన మాటలలో ఎంతో కొంత అసత్యం ఉందని భవాని గ్రహించినా ఆ విషయం అక్కడ ప్రస్తావించ దలచుకోలేదు.

'సరే. నాతో రా,' అంది దాసితో.

'ఎక్కడికి?' దాసి అడిగింది.

'నర్మద దగ్గరికి,' భవాని సమాధానమిచ్చింది.

ఈమాట వినగానే దాసి మరోసారి కంపించిపోయింది. అయినా కొంచెం నిగ్రహించుకొని అడిగింది.

'ఆమె ఎక్కడుంది?'

'దూరంగా కనిపిస్తున్న ఆ నది ఒడ్డున,' అంటూ భవాని నదివైపు వ్రేలితో చూపిస్తూ తానూ అటు చూసింది.

దూరంగా ఉన్న నది ఒడ్డున నర్మద గుర్రంమీద ఆగి ఉండడం భవాని గమనించింది. వెంటనే దాసివైపు చూసి మళ్ళీ అంది.

'ఆమె అక్కడ ఒంటరిగా నిలబడి నాకోసం ఎదురు చూస్తోంది. వెళ్దాం రా. గుర్రమెక్కు. నిన్ను కూడా గుర్రం మీద తీసుకువెళతాను.'

దాసికేం పాలుపోలేదు. ఒక్క నిమిషం మౌనంగా ఆలోచించింతర్వాత తప్పని పరిస్థితిలో దగ్గర్లోనే ఉన్న గుర్రంమీది కెక్కింది. మరుక్షణంలో భవానికూడా గుర్రంమీదికి తూనీగలా ఎగిరి కూర్చుని నదివైపుకు దానిని దౌడు తీయించింది. కాసేపట్లో గుర్రం నర్మద నిలబడి ఉన్న చోటికి వెళ్ళి ఆగింది.

గుర్రంమీద భవానితో పాటు దాసినికూడా చూసి నర్మద ఆశ్చర్యపోయింది. ఆమె ఏమీ అడగకముందే భవాని నర్మదతో అంది.

'భవనంవైపు వెళదాం పద. వెళ్తూ దారిలో సంగతులన్నీ చెప్పుకుందాం.'

రెండు గుర్రాలూ భవనంవైపు దారి తీశాయి. దాసి ప్రాణం లేనిదానిలా గుర్రంమీద కూర్చుంది. నర్మదవంక చూడడానికి కూడా ధైర్యం చాలలేదు.

'దాసి గుర్రంమీదికెలా వచ్చింది?' నర్మద నవ్వుతూ అడిగింది.

భవానికూడా సమాధానంగా నవ్వింది. తర్వాత దాసి తనతో చెప్పిన విషయాలన్నీ పూస గుచ్చినట్టుగా నర్మదకు చెప్పి వినిపించింది.

నర్మద దాసివంక చూసి సందేహంగా అడిగింది.

'ఇంతేనా జరిగింది ?'

దాసి మాట్లాడలేక ఔనన్నట్టుగా తల ఊపింది. తర్వాత కాసేపటికి నూతిలోంచి మాట్లాడుతున్నట్టుగా అంది.

'ఇంతేనండి'

'సరే. నువ్వు చెప్పిన విషయాలన్నీ నిజాలో, అబద్ధాలో నేను తెలుసుకుంటాను. గూఢచారి ఎలాగో నా దగ్గరికి రాక పోడుగా,' అంది నర్మద దానిని బెదిరిస్తున్నట్టుగా.

దాసికి ఈమాట వినగానే శూలం గుచ్చుకున్నట్టయింది. ఒకవేళ గూఢచారి అక్కడికి వచ్చి తాను పారిపోయినట్టు నర్మదతో చెబితే! మరుక్షణంలో కొంత ధైర్యం తెచ్చుకుంది దాసి. ఆ సమయంలో మరొక్క అబద్ధమాడి తప్పించుకోడానికి గల అవకాశాలను గురించి ఆలోచించసాగింది.

## 10

నర్మద, భవాని గుర్రాలమీద కనిపించకుండా వెళ్లిపోయిం తర్వాత పద్మిని భవనంలోకి బయలుదేరింది. తలమీది గాయం నించి రక్తం చిగిర్చడం ఆగిపోయింది. కాని చాలా బాధగా మాత్రం ఉంది. తనను భవనంలోంచి ఇక్కడికి తెచ్చిన వ్యక్తి తెవరై ఉంటారా అని ఆమె కాసేపాలోచించింది కాని ఎవరైందీ నిర్ణయించుకోలేకపోయింది.

ఒడ్డున ఉన్న పడవను నిండుగా ఉన్న చెరువులో తనకు పరిచితమైన మార్గంలో నడుపుకుంటూ ఆమె అవతలివైపుకు

వెళ్లింది. ఓసారి చెరువులోకి వచ్చిన కొత్త నీటివంక పరిశీలనగా చూసి వెనక్కి తిరిగి భవనంలోకి నడచింది. చెరువులో నీరు తగ్గిపోవడానికిగాని, తిరిగి చెరువు కొత్త నీటితో నిండడానికి గాని కారణం ఆమెకు ఎంత యోచించినా తెలియలేదు.

ఆమె భవనంలోకి వెళ్లగానే భయం భయంగా అక్కడక్కడా దాగిఉన్న దాసీలందరూ బయటికి వచ్చారు. తుందామె తలమీద ఏర్పడిన గాయానికి కట్టు కట్టారు.

కాసేపయింతర్వాత పద్మిని వాళ్లనడిగింది.

'ఇంతకూ అసలేం జరిగిందో మొదటినించీ చెప్పండి.'

దాసీలలో ఒకతె అంది.

'మాకుమాత్రమేం తెలుసండి. ఎవరి పనులలో వాళ్లున్నాం. అకస్మాత్తుగా కత్తుల చప్పుడు వినిపించింది. ఏమిట్లో అని కంగారుగా వచ్చి చూస్తే ఆ ముసుగు వ్యక్తులు మన భటులతో పోట్లాడుతున్నారు. తర్వాతి సంగతి మీకు తెలిసిందే. నేం భయపడి తలో చోటికిపోయి దాక్కున్నాం.'

పద్మిని మళ్ళీ అడిగింది.

'తర్వాత నన్ను తీసుకెళ్ళిన భటులెవరో మీరు గుర్తుపట్టగలిగారా?'

'మాలో ఎవరికీ వాళ్లెవరో తెలియదండి. ఇదివరకెక్కడా చూడలేదు,' అని సమాధానమిచ్చింది మరొక దాసి.

కాసేపు నిశ్శబ్దంగా గడచింది. దాసీలలో ఒకతె పద్మినితో అంది.

'మీరు విశ్రాంతి తీసుకోవడం మంచిది. మీ గదిలోకి వెళ్లండి.'

'నేను నా గదిలోకి ఎలాగో వెళతాను. నర్మద, ఆమె సోదరి భవాని కాసేపట్లో ఇక్కడికి వస్తారు. వాళ్లకు కావలసిన ఏర్పాట్లు చేయండి,' పద్మిని అంది.

తర్వాత ఆమె తన గదిలోకి వెళ్ళి విశ్రాంతిగా పవ్వళించింది. దాసీలందరూ పద్మిని చెప్పిన ప్రకారం తమ పనుల్లో మునిగిపోయారు.

గంటసేపు గడచింది. పద్మిని బాధతో కాసేపు మైమరచి నిద్రపోయింది. మధ్యాహ్నపువేళ దాటిపోయి సాయంకాలం కావచ్చింది. పద్మినికి మెలుకువ వచ్చేసరికి గుమ్మం దగ్గర ఎవరివో అడుగులచప్పుడు వినిపించింది. ఆమె తలెత్తి గుమ్మం కేసి చూసింది. దాసి ఒకతె గుమ్మంలోకి వచ్చి నిలబడింది.

'ఎవరైనా వచ్చారా?' పద్మిని అడిగింది.

'మన గూఢచారి, ఆయనతో పాటు మరెవరో వచ్చారు. వాళ్ళను లోపలికి తీసుకురావాలి,' అంది దాసి.

గూఢచారితో పాటు నర్మద చెప్పిన ప్రకారం దాసి రావలసి ఉంది. దాసి వస్తే వాళ్లు గుర్తుపట్టి ఉంటేవాళ్లు. అయితే దాసికాక మరెవరు వచ్చినట్టు! దాసి ఏమైందో? పద్మిని ఆలోచిస్తూ మంచంమీదినించి లేచి బయటికి వచ్చింది.

చెరువుకు అవతలి గట్టున గూఢచారితో పాటు రఘువీర్ మహారాజును చూడగానే ఆమెకు అనంతాశ్చర్యాల్కు కలిగాయి. గబగబా పడవను నడుపుకు వెళ్ళి ఆ ఇద్దరినీ భవనంలోకి తీసుకువచ్చింది.

పద్మిని రఘువీర్ మహారాజును చాలాసార్లు చూసి ఉన్నా ఆయన మాత్రం పద్మినిని చూడలేదు. ఒకవేళ ఒకటి రెండు సార్లు చూసి ఉన్నా గుర్తుపట్టే పరిస్థితి దాటిపోయింది.

భవనంలోకి రాగానే ఆయనను పద్మిని నర్మద గదిలోకి తీసుకు వెళ్ళింది. ఆ గది చక్కగా అలంకరింపబడి ఉంది. అందమైన వస్తువులెన్నో గదిలో ఉచిత స్థలాలలో అలంకరించబడి ఉన్నాయి. మహారాజు ఓసారి గది నాలుగుమూలలా పరికించి చూశాడు.

'నర్మదగారు ఇంకా ఇక్కడికి రాలేదా?' గూఢచారి పద్మినిని అనుమానంగా అడిగాడు.

'చాలాసేపయింది, వచ్చి వెళ్ళారు. మళ్ళీ కాసేపట్లో వస్తానని చెప్పారు. ఆమెకోసమే ఎదురుచూస్తున్నాం,' అంది పద్మిని సమాధానంగా.

ఇంతలోనే ఒక దాసి ఆ గది దగ్గరకు వచ్చింది.

'నర్మదగారు వచ్చారు,' పద్మినితో అంది నెమ్మదిగా.

'ఆమె వచ్చినట్టుంది. తీసుకువస్తాను,' అంటూ పద్మిని అక్కడినించి గబగబా బయటికి వెళ్ళిపోయింది.

అప్పటికి ఎండ పూర్తిగా తగ్గిపోయింది. సూర్యుడు కొద్ది సేపట్లో అస్తమించడానికి సిద్ధంగా ఉన్నాడు. చెరువు నిండా ఉన్న కొత్త నీటిమీదనించి చల్లనిగాలి భవనంలోని ప్రతి గదిలోకి వీస్తోంది. రఘువీర్ మహారాజు ఆనందంగా తాను కూర్చున్న ఆసనంమీద వెనక్కి వాలాడు.

పద్మిని గదిలోంచి వెళ్ళగానే గూఢచారి కూడా మహారాజును అక్కడ ఒంటరిగా వదిలి బయటికి వచ్చాడు. నర్మద

తనవాడు కేకలు వేయకుండా ముందుగానే సంగతి సందర్భాలు చెప్పుకోవాలనుకున్నాడతను.

తీరా నర్మద, భవానితో పాటు దాసికూడా భవనంలోకి రావడంతో అతని ఆశ్చర్యానికి మేరలేకపోయింది. దాసి వీళ్ళకెక్కడ కనిపించిందో, వీళ్ళతో పాటు ఎలా వచ్చిందో అతని కర్థం కాలేదు. అనేకరకాల ఆలోచనలు అతనికి కలిగాయి.

ఈ సమయంలో తాను మాట్లాడడం మంచిదికాదని గూఢచారి మౌనం వహించాడు. పద్మిని రఘువీర్ మహారాజు వచ్చిన సంగతి నర్మదకు తెలియచేసింది.

దాసిని బంధించమని పద్మినిని ఆజ్ఞాపించి నర్మద భవానితో సహా తిన్నగా తన గదిలోకి నడిచింది. గూఢచారి దాసినడిగి అసలు సంగతి తెలుసుకుందామనే కుతూహలంతో పద్మినితో పాటు అక్కడే ఉండిపోయాడు.

పద్మిని నర్మద చెప్పినప్రకారం దాసిని ఒకచోట బంధించింది. గూఢచారి దాసితో మాట్లాడదల్చుకున్నా తర్వాత మాట్లాడవచ్చులే అని అతని కోర్కెను త్రోసిపుచ్చింది.

నర్మద, భవాని గదిలోకి వెళ్లగానే రఘువీర్ మహారాజు చిరునవ్వు నవ్వాడు.

'ఈ భవనంలో నాకు చాలా హాయిగా ఉంది. ఇంత చక్కని వాతావరణం మరెక్కడా ఉండబోదని నా ఉద్దేశం.' అన్నాడాయన నర్మదవంక చూసి.

నర్మదకూడా సంతోషంగా నవ్వింది.

'భాగ్యహాలలో నివసించేవారికి ఈ భవనం రమణీయంగా కనిపించడంలో వింతేమీ లేదు.' అంది చమత్కారంగా.

మహారాజా మాట్లాడలేదు. వెంటనే నర్మద మళ్ళీ అంది.

‘మీరిక్కడికెలా వచ్చారో నాకర్థం కావటంలా ఉంది.’

మహారాజు జరిగిన విషయాన్ని ఆమెకు తెలియచేశాడు. గూఢచారి ఏమీ తప్పు చెయ్యలేదన్నాడు.

‘ఆ దాసికూడా దొరికిందిలెండి. మాతో పాటు తీసుకు వచ్చి బంధించాం,’ అంది భవాని.

‘యమదూత ఏమయ్యాడు? మీతో పాటు బయలుదేరాడు కదూ?’ నర్మద అడిగింది.

‘మహామాయను, మంత్రిని వెదుకుతూ వెళ్ళాడు,’ అని సమాధానమిచ్చాడు మహారాజా.

ఇంతలో పద్మిని ఆ గదిలోకి వచ్చింది.

‘యమదూత, మరెవరో వ్యక్తివచ్చి చెరువుకు అవతలి గట్టున నిలబడి ఉన్నారు. తీసుకురమ్మంటారా?’ నర్మద నడిగింది.

‘నువ్విక్కడ ఉండు. నేనే తీసుకువస్తాను,’ అంటూ నర్మద గదిలోంచి గబగబా వెళ్ళిపోయింది. పద్మిని అక్కడే నిలబడింది.

కాసేపక్కడ నిశ్శబ్దం ఆవరించింది. ఎవరూ మాట్లాడడానికి తగిన విషయాలు లేవు. ముగ్గురూ మౌనం వహించారు.

నర్మద యమదూతను, అతనితో పాటున్న వికృతపురుషుని తీసుకుని భవనంలో ప్రవేశించింది. ఆ వికృతపురుషుని ఎవరో నర్మద ముందుగా గుర్తుపట్టలేకపోయింది. కాని అతను రహస్యంగా చేసిన సైగనుబట్టి అతనెవరో ఆమె తెలుసుకుంది.

ఐతే ఆతని భుజాన స్పృహతప్పిపోయి ఉన్న ఆ వ్యక్తి ఎవరో మాత్రం ఆమెకు తెలియలేదు.

ముగ్గురూ తిన్నగా రఘువీర్ మహారాజు ఉన్న చోటికి వచ్చారు. ఆయన నక్కడ తలవని తలంపుగా చూడడంతో యమదూతకు ఆశ్చర్యం కలిగింది.

వికృతపు మనిషి తన భుజంమీదున్న వ్యక్తిని నేలమీదికి దించాడు. గదిలో ఉన్న వారందరిదృష్టులూ ఆ పడిపోయి ఉన్న వ్యక్తి మీదికి ప్రసరించాయి. ఆ వ్యక్తివైపు పరీక్షగా చూసిన పద్మిని మరుక్షణంలో కెవ్వుమని ఆర్తనాదం చేసింది. అందరూ ఆమెవైపు ఆశ్చర్యంగా చూశారు.

—:o:—

పద్మిని ఎందుకు ఆర్తనాదం చేసింది? వికృతపు మనిషి ఎవరు? మంజుల, మంశర ఏమయ్యారు? తర్వాత ఏం జరిగింది? మొదలైన విషయాలు మహామాయ పన్నెండవ పుస్తకం 'దండయాత్ర' లో చదవండి.

జనవరి 30 వ తేదీన వెలువడుతుంది

తెలుగు పాఠకులతో విశేషంగా ప్రశంసింపబడిన ఏకైక డిటెక్టివ్ అండ్ మిస్టరీ నవల —

మహామాయ-12

# దండయాత్ర

ఏజెంట్లందరు పై తేదీలోపునే తమ ఆర్డర్లను డబ్బుతో పాటు పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. అప్పుడే సకాలంలో పుస్తకాలు అందజేయగలం.

మహామాయ సీరియల్‌లో ఇంతవరకు వెలువడిన పది కొండు పుస్తకాలు, ఏజెంట్లు తమవద్ద ప్రతులు అయిపోగానే తిరిగి తెప్పించుకొనడం మరువవలదని కోరుతున్నాం.

ఏజెంట్లవద్ద లభించని పుస్తకాలను పాఠకులు తిన్నగా మాకు డబ్బు పంపి తెప్పించుకోవచ్చు. లేదా చందాదారులుగా చేరవచ్చు.

విజ్ఞాన సాహితి
టి. నగర్ : : మద్రాసు-17

తెలుగు పాఠకులకు విజ్ఞాన సాహితి వారి మహత్తర కానుక




(తెలుగు డైజెస్ట్)

ఎడిటర్ : కనకమేడల

తెలుగు పాఠకులకు ఒక డైజెస్ట్ మాసపత్రికను నూతన పంథాలో, వారి అభిరుచుల కనుకూలంగా వెలువరించబోతున్నందుకు గర్విస్తున్నాం. ఈ పత్రిక కూడా మా ప్రచురణల మాదిరి అందరి విశేషాదరాభిమానాలు పొందగలవనడం నిర్వివాదాంశం.

1957 ఉగాదికి 'కథానిక' సర్వాలంకారాలతో మీ చేతుల నలంకరించ గలదు.

ఏజెంట్లకు కావలసిన మిగిలిన వివరాలు వచ్చే పుస్తకంలో ప్రకటిస్తాం.

VIGNANA SAHITI
MADRAS-17